ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 6 నవంబరు 2025



కన్నుల పండువగా జ్వాలాతోరణ మహోత్సవం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను పల్లకిలో తోరణం కింద నుంచి మూడుసార్లు అటూఇటూ తిప్పారు. జ్వాలా తోరణాన్ని దర్శించుకున్నా, దాని కింద నడిచినా సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. అందుకే వేలాది మంది శివాలయాలకు తరలివస్తారు. జ్వాలాతోరణం దాటిన వారికి యమలోకంలో అడుగుపెట్టే పరిస్థితి ఎదురుకాదని, పరమేశ్వరుడి అనుగ్రహం లభిస్తుందని నమ్ముతారు.

వరాహ పుష్కరిణికి జలహారతి




ప్రత్యేక వేదికపై వేంకటేశ్వరస్వామి

కార్తీక పౌర్ణమి సందర్భంగా సింహాచలంలోని వరాహ పుష్కరిణికి బుధవారం జల హారతి ఇచ్చారు. దేవస్థానం ఉపాలయం నుంచి పద్మావతీ, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. స్వామికి ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు షోడశోపచారాలు ఇచ్చిన అనంతరం పుష్కరిణికి ఏక, ద్వయ, సప్త, కుంభ, నక్షత్ర తదితర దశ హారతులను సమర్పించారు. అశేష సంఖ్యలో హాజరైన భక్తులు దీపాలు వెలిగించి పుష్కరిణిలో విడిచిపెట్టారు. - 8లో



కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణం

ఉక్కులో తనిఖీలు



విశాఖతో పాటు పొరుగు జిల్లాల నుంచి ఆరుగురు అధికారుల నియామకం

- ఏటా ఒక్కరోజే... ఈసారి నాలుగు రోజులు
- భద్రతా లోపాలపై నిశిత పరిశీలన
- వరుస ప్రమాదాలతో ఉద్యోగ, కార్మిక వర్గాల ఆందోళన
- ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్‌ప్లాంటులో తొలిసారి ప్రత్యేక తనిఖీలు జరుగుతున్నాయి. గత నాలుగేళ్ల నుంచి ప్లాంటులో నిర్వహణ పనులు ఆగిపోయాయి. నిధుల లేమితో మరమ్మతులు కూడా సరిగా నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంలో స్టీల్ మెల్టింగ్ షాపు, కోక్ ఓవెన్, సింటర్ ప్లాంటుల్లో ప్రమాదాలు సంభవించాయి. ఎనిమిది మంది మరణించారు. అందులో ఐదుగురు ఉద్యోగులు కాగా మరో ముగ్గురు కాంట్రాక్టు కార్మికులు. ప్రమాదాలపై ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తనిఖీలు జరిపి నివేదిక ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగాన్ని ఆదేశించింది.

ఇప్పటివరకూ ఏడాదికొకసారే తనిఖీలు

ఎప్పుడు పడితే అప్పుడు తనిఖీలకు రావడం వల్ల సమస్యలు వస్తున్నాయని యాజమాన్యాలు ఆరోపించడంతో ఏడాదికి ఒకసారి మాత్రమే తనిఖీ చేయాలని గతంలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఏ కర్మాగారాన్ని ఎవరు, ఏ తేదీన తనిఖీ చేయాలో సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ పోర్టల్ ద్వారా ముందుగానే తెలియజేసేవారు. ఆ అధికారి మాత్రమే వెళ్లి తనిఖీ చేసి లోపాలు గుర్తించి, వాటిని సరిచేసుకోవాలని చెప్పేవారు. ఇలా విశాఖపట్నంలో స్టీల్ ప్లాంటులో కూడా ఏడాదికి ఒకసారే తనిఖీలు జరుగుతున్నాయి.

ఆరుగురు అధికారులు... నాలుగు రోజులు

స్టీల్ ప్లాంటు పది వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. పదుల సంఖ్యలో విభాగాలు ఉన్నాయి. ఒక్కరోజులో ఒక్క అధికారి అంతా తనిఖీ చేయడం కష్టం. అయినా ఇన్నాళ్లు అలాగే నామమాత్రపు తనిఖీలు చేసుకుంటూ వచ్చారు. ఈసారి ప్రభుత్వం అన్ని విభాగాలు పరీక్షించాలని చెప్పడంతో విశాఖపట్నం జిల్లాలోని ... మిగతా 6వ పేజీలో

ఏసీబీ సోదాలు

జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకూ నిర్వహణ

- అనంతరం సబ్ రిజిస్ట్రార్‌లను, డాక్యుమెంట్ రైటర్లను తమ కార్యాలయానికి తీసుకువెళ్లి వాంగ్మూలాలు నమోదు
- సూపర్ బజార్ (ఆర్‌వో), పెద గంట్యాడ కార్యాలయాల్లో నగదు దొరికినట్టు ప్రచారం
- వివరాలు వెల్లడించని అధికారులు
- తనిఖీలతో నిలిచిన రిజిస్ట్రేషన్లు
- నేడు కూడా కొనసాగింపు



మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

అవినీతి నిరోధక శాఖాధికారులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. జిల్లాలోని సూపర్‌బజార్ (ఆర్‌ఓ) కార్యాలయం, మధురవాడ, పెదగంట్యాడల్లో తనిఖీలు చేశారు. ఉదయం 11 గంటలకు వెళ్లిన ఏసీబీ అధికారులు రాత్రి ఏడు గంటల వరకూ అక్కడే ఉన్నారు. ఆ తరువాత సబ్ రిజిస్ట్రార్లను, కొంతమంది డాక్యుమెంట్ రైటర్లను, వారి సహాయకులను ఏసీబీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ అక్కడే ఉంచి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీలు గురువారం కూడా కొనసాగే అవకాశం ఉంది. ఈ సోదాల సమాచారం అధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు.

కొంతమంది వద్ద డబ్బులు?

ఏసీబీ తనిఖీలలో కొందరి వద్ద నగదు లభ్యమైందని ప్రచారం జరుగుతోంది. సూపర్ బజార్ కార్యాలయంలో రూ.10 వేలు, పెదగంట్యాడ కార్యాలయంలో రూ.2 లక్షల వరకూ దొరికిందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ మొత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది వద్ద కాకుండా అక్కడకు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన డాక్యుమెంట్ రైటర్లు, వారి సహాయకుల వద్ద లభించిందని సమాచారం.

ఎప్పుడూ వారి వద్దే నగదు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివిధ పనులు చేయించడానికి డాక్యుమెంట్ రైటర్లు దళారులుగా ఉంటున్నారు. ఎవరైతే ఆస్తిని కొంటున్నారో...వారికి ముందే ఎంత ఖర్చు అవుతుందో చెబుతారు. ఆస్తి విలువపై రిజిస్ట్రేషన్ చార్జీలు 7.5 శాతం చెల్లించాలని, కార్యాలయం ఖర్చులకు ఆస్తిని బట్టి రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు అదనంగా తీసుకుంటారు. అందులో డాక్యుమెంటేషన్ చార్జీల కింద సగం మినహాయించుకుని మిగిలినది కార్యాలయం సిబ్బందికి ఎక్కడో బయట అందిస్తారు. ఇది ఆయా కార్యాలయాల్లో జరిగే రొటీన్ వ్యవహారం. ఏసీబీకి ... మిగతా 6వ పేజీలో

సీఎం చేతులమీదుగా పట్టాలు పంపిణీ?

ఇన్‌చార్జి మంత్రి ఎదుట ఎమ్మెల్యే వెలగపూడి ప్రతిపాదన



- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం ఇప్పటివరకూ 12 వేల దరఖాస్తులు రాక
- సమస్యలపై ఎమ్మెల్యేలు, అధికారులతో డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి భేటీ

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి బుధవారం సర్క్యూట్‌హౌస్‌లో ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకుని, అక్కడే ఉన్న ... మిగతా 6వ పేజీలో

పశుమాంసం విక్రయశాలలపై దాడులు

ఐదు చోట్ల ఆవు మాంసం విక్రయిస్తున్నట్టు గుర్తింపు

- సుమారు 600 కిలోలు స్వాధీనం
- రూ.1,500 చొప్పున జరిమానా విధింపు
- మరోసారి పట్టుబడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆరిలోవలోని బీఫ్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ప్రజారోగ్యవిభాగం అధికారులు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న పశువధశాలల (కబేళాలు)పై జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఆరిలోవ, రైల్వేన్యూకాలనీ, గాజువాక, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో గోవులను వధించి, మాంసాన్ని నగరంలోని దుకాణాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండడంపై బుధవారం 'గోవధ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవీఎంసీ ప్రధాన పశు వైద్యాధికారి డాక్టర్ రవిరాజు తన సిబ్బందితో ఆరిలోవలో తనిఖీలు చేశారు. ఉదయం ఏడు గంటలకే అధికారులు వెళ్లడంతో కబేళాలు నిర్వహిస్తున్న గోడౌన్లు అన్నీ మూసివేసి ఉన్నాయి. పశు మాంసం విక్రయించే ఐదు దుకాణాల్లో తనిఖీ చేయగా సుమారు 600 కిలోలు వరకూ ఆవు మాంసం లభ్యమైంది. వారికి ఆ మాంసం ఎక్కడి నుంచి వచ్చిందని అధికారులు ప్రశ్నించారు. తాము పశువులను వధించడం లేదని, ఇతర ప్రాంతాల నుంచి మాంసం వస్తోందని దుకాణదారులు చెప్పారు. ఒక్కో దుకాణానికి రూ.1,500 చొప్పున ఐదు దుకాణాలకు రూ.7,500 జరిమానా విధించారు. సీజ్ చేసిన ఆవు మాంసాన్ని కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ గోతిలో పాతిపెట్టించారు. నగరంలో మారికవలస వద్ద మాత్రమే అధికారిక కబేళా ఉందని, అక్కడ కూడా ఆవులను వధించడం నిషేధమని వ్యాపారులకు డాక్టర్ రవిరాజు వివరించారు. ఎవరైనా అనధికారికంగా కబేలా నిర్వహించినా, ఆవులను వధించినా, ఆవు మాంసం విక్రయించినా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై నగరంలో కబేళాలు, పశువుల మాంసం విక్రయించే దుకాణాలను తరచూ తనిఖీ చేస్తామని, ప్రజారోగ్యానికి హాని కలిగించే మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డాక్టర్ రవిరాజు స్పష్టంచేశారు.

వేధింపులు, వెక్కిరింతలు

నిత్యం సిబ్బందిపై చిందులు

- ఇదీ కనకమహాలక్ష్మి ఆలయంలో ఓ అధికారి తీరు
- గ్రహాంతరవాసులంటూ వేద పండితులను ఉద్దేశించి వ్యాఖ్యలు
- రావడం, వెళ్లడం తప్ప పని ఏమి ఉందంటూ...వారిపై అసహనం
- మహిళా ఉద్యోగికి బెదిరింపు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి ఆలయంలో ఓ అధికారి వైఖరి దేవదాయ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిత్యం చిరాకు ప్రదర్శిస్తూ తనకు ఎదురుపడిన ప్రతి ఒక్కరినీ దూషించడమే అలవాటుగా మార్చుకున్న ఆ అధికారిపై అందరిలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమ్మవారికి నిత్యం పూజలు చేసే పండితులను సైతం నిందించడం, వెక్కిరించడాన్ని సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. పూజార్లకు భక్తులు వేసే దక్షిణలో వాటా, అన్నదాన సత్రం నుంచి నెల నెలా కొంత మొత్తం ఆశించిన విషయం రెండు నెలల క్రితం పత్రికల్లో రావడంతో సంబంధిత వర్గాలపై సదరు అధికారి మండిపడ్డారు. దీనికి కారణమని భావించి ఒక ఉద్యోగిని వేరే ఆలయానికి బదిలీ చేశారు. మరో ఉద్యోగిని ఏకంగా విధులకే రావద్దని ఆపేశారు.

అమ్మవారి ఆలయంలో భక్తులకు వేదపండితులు ఆశీర్వచనం చేస్తారు. కూర్చోబెట్టి వేదమంత్రాలు పఠిస్తారు. వారి పట్ల ఎందుకు ఏవగింపు కలిగిందో తెలియదు గానీ 'మీరు గ్రహాంతరవాసులు (ఏలియన్స్)' అంటూ నిత్యం నిందిస్తున్నారు. 'మీరు రావడం, వెళ్లడం తప్ప ఇంకేమిటి పని?' అని చులకనగా చేసి మాట్లాడుతున్నారు.

దాతలపైనా చిన్నచూపే

అమ్మవారి ఆలయంలో జరిగే పూజలకు పలువురు దాతలు నిధులు సమకూరుస్తారు. అటువంటివారు వచ్చినప్పుడు పండితులంతా తగిన మర్యాదలు చేయడం ఆనవాయితీ. ఇటీవల ఒక దాత విజయదశమి నవరాత్రుల్లో లక్ష రూపాయలు విరాళం ఇచ్చి పూలతో అమ్మవారికి పూజలు చేయించారు. ఆయనతో పాటు మరో ఇద్దరు పూజకు రాగా మొత్తం ముగ్గురికి సిబ్బంది కండువాలు చేసి, ఆశీర్వచనం ఇచ్చారు. ఈ విషయం తెలిసి వారిపై ఆ అధికారి మండిపడ్డారు. ఒక్కరే విరాళం ఇచ్చారని, ముగ్గురికి కండువాలు ఎందుకు వేశారంటూ చిందులు వేశారు. లక్ష రూపాయలు ఇచ్చిన వారికి వంద రూపాయల విలువైన కండువాలు ... మిగతా 6వ పేజీలో

డీసీసీబీలో దందాపై ఆప్కాబ్ ఆరా

పదోన్నతికి అన్ని అర్హతలున్నా డబ్బులు వసూలు

- మంత్రి సిఫారసు చేసిన ఉద్యోగి వద్ద కూడా...
- బ్యాంకులో అనధికార వ్యక్తి పెత్తనం
- ప్రాథమిక సహకార సంఘాల నుంచి కూడా నెలవారీ మామూళ్ల వసూళ్లకు ప్రయత్నం



విశాఖపట్నం/నర్సీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అన్నిరకాలుగా అర్హతలున్న ఒక ఉద్యోగికి పదోన్నతి కల్పించాలని మంత్రి ఒకరు స్వయంగా ఫోన్ చేసి బ్యాంకు పాలకులకు చెప్పారు. అయితే మంత్రి సూచన పాటించామని చెబుతూనే పదోన్నతి పొందిన సదరు ఉద్యోగి నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారు. ఈ విషయం మంత్రికి తెలియడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిసింది. అలాగే పదోన్నతి పొందిన ఒకరు అడిగినంత సొమ్ము ఇవ్వలేదని శివారు ... మిగతా 6వ పేజీలో

ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

తగరపువలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఏ ఇంగ్లీష్ చేసి, ఏపీసెట్‌లో ఉత్తీర్ణులైన వారు లేదా పీహెచ్‌డీ చేసిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతో ఈనెల 7న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె సూచించారు.

సైకిళ్లపై శబరిమలకు..

తగరపువలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంతపేటకు చెందిన గుడ్ల నర్సిరెడ్డి, తాడి పైడిరాజు, దుర్రి గురువులురెడ్డి బుధవారం సాయంత్రం సైకిళ్లపై శబరిమల బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు మూడుసార్లు సైకిళ్లపై శబరిమల వెళ్లామని చెప్పారు. రాత్రి పూట ఏదో ఒకచోట అయ్యప్ప పీఠానికి చేరి విశ్రాంతి తీసుకుని, మరుసటి రోజు తెల్లవారుజామున బయలు దేరుతామన్నారు. రోజుకు కనీసం 50 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ నెల రోజుల్లో స్వామివారి సన్నిధానానికి చేరుకుంటామని తెలిపారు.

111 మందికి ఉపకార వేతనాలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 8వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న 111 మంది విద్యార్థులకు దివీస్ కంపెనీ రూ. 6.17.500 లక్షల ఉపకార వేతనాలు చెల్లించింది. బుధవారం ఆ కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం, మూలకుద్దు, గుడివాడ, నగరపాలెం, లింగాలవలస, తూడెం చెరుకుపల్లి పంచాయతీలకు చెందిన విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రావు, సీఎస్ఆర్ మేనేజరు సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అసోసియేట్ ప్రొఫెసర్ మృతి

సాగర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య పెరుమాల్ సుందరయ్య (53) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ విభాగంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌కు ఆయన హెడ్‌గా ఉన్నారు. స్వస్థలం విజయనగరం జిల్లా బొబ్బిలి. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సుందరయ్య మృతి పట్ల సహచర ఉద్యోగులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ముగ్గురికి పతకాలు

తగరపువలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగివలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విశాఖలోని డాక్టర్ ఎల్‌బీ కళాశాలలో నిర్వహించిన ఏయూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పలు పతకాలు సాధించారు. సీఎస్ఎం విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న తరుణ్‌కుమార్ బంగారు పతకం, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి అజయ్‌రెడ్డి వెండి, ఈఈఈ విభాగానికి చెందిన పి. అఖిల్ కాంస్య పతకం పొందారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి విజేతలను అభినందించారు.

గొయ్యి పూడ్చివేత

మధురవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులోని శిల్పారామం ఎదురుగా ఉన్న మిథిలాపురి వుడా కాలనీ వంద అడుగుల రోడ్డు ప్రారంభంలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని జీవీఎంసీ సిబ్బంది బుధవారం పూడ్చారు. అక్కడ గొయ్యి ప్రమాదకరంగా ఉన్న విషయమై ఈనెల 1న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. స్పందించిన జీవీఎంసీ సిబ్బంది గొయ్యిని ఇటుకలు, కంకరతో పూడ్చారు.

గాలిమేడను పునర్నిర్మించాలని వినతి

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాలి మేడను పునర్నిర్మించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఎంపీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన రౌండ్ బంగ్లా (గాలిమేడ) సందర్శకులకు చక్కటి అనుభూతి ఇచ్చేదన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పునర్నిర్మించి, అభివృద్ధి చేయాలని విన్నవించారు.

తర్లువాడ భూములను పరిశీలించిన సీపీఐ

ఆనందపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ పంచాయతీలో గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన దళితుల అసైన్డ్ భూములను సీపీఐ విశాఖ జిల్లా బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రభుత్వం 48 దళిత కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున ఇచ్చిందన్నారు. ఆ భూముల్లో రైతులు ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక సహాయంతో బోరుబావులు తీసి, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలు పండిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆ భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, మన్మథరావు, వనజాక్షి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా పట్టాలు పంపిణీ?

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు సూచనలు చేశారు. వేలాది మంది పేదల ఇళ్ల క్రమబద్ధీకరణకు వస్తున్న దరఖాస్తులను అధికారులు ఆమోదిస్తున్నారని, ఈ నేపథ్యంలో నగరంలో భారీ సభ నిర్వహించి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తే బాగుంటుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రతిపాదించారు. భాగస్వామ్య సదస్సు కోసం ఏయూలో భారీ వేదిక నిర్మిస్తున్నారని, ఆ కార్యక్రమం ముగిసిన రెండు, మూడు రోజులకు అదే వేదికపై పట్టాలు పంపిణీ చేయాలన్నారు. నగరంలో ఇప్పటివరకూ 12 వేల దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొనగా, మంత్రి స్పందిస్తూ సీఎంతో చర్చించిన తరువాత పట్టాలు పంపిణీ చేద్దామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో ప్రభుత్వ న్యాయవాదుల నుంచి అనుకున్న సహకారం రావడం లేదని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ప్రస్తావించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దక్షిణ నియోజకవర్గంలోని కల్లుపాకల ఏరియాలో ఒక జమీందారుకు చెందిన రెండు ఎకరాలు తీసుకుని పట్టాలు పంపిణీ చేశారని, ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదని దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకురాగా అధికారుల నుంచి వివరాలు తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు.

వేధింపులు, వెక్కిరింతలు

... 5వ పేజీ తరువాయి

వేయడం తప్పా?...అని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఆ ఉత్సవాలన్నీ దాతల ఖర్చుతోనే

కనకమహాలక్ష్మి ఆలయానికి జగదాంబ సెంటర్‌లో సీతారామ స్వామి ఆలయం కూడా ఉంది. అక్కడ ఇటీవల ఉత్సవాలు నిర్వహించినప్పుడు ఆ ఖర్చు అంతా దాతలే పెట్టుకున్నారు. అయితే అంతా దేవస్థానం నుంచే ఖర్చు చేసినట్టు బిల్లులు పెట్టుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా కనకమహాలక్ష్మి ఆలయంలో అందరి ముందు ఓ మహిళా ఉద్యోగిని పట్టుకొని సదరు అధికారి గట్టిగా గదమాయించినట్టు తెలిసింది. ఇలా అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరినీ అకారణంగా నిందిస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధికారితో మార్గశిర ఉత్సవాలు నిర్వహించడం కత్తిమీద సామేనని సిబ్బంది వాపోతున్నారు

19న అనంత పద్మనాభుని దీపోత్సవం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులతో సమావేశం


ఉత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్‌డీఓ సంగీత్ మాథూర్

పద్మనాభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19న జరిగే అనంతుని దీపోత్సవాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమర్థంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహణపై బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిని అధిరోహించే వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడికక్కడ తాగునీరు, ప్రసాదం పంపిణీ చేయాలన్నారు. ఘాట్ రోడ్డులో గిరిని అధిరోహించే వారికి ఇబ్బంది లేకుండా దారి పొడవునా లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవం రోజున దూర ప్రాంతంలో బస్సులు నిలిపివేయనుండడంతో మహిళలు పద్మనాభం ఆలయం సమీపంలోకి చేరుకోవడానికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కాగా దేవస్థానం వద్ద నిధులు లేని కారణంగా ఉత్సవ నిర్వహణకు సహకరించాలని ఈఓ వీఎల్ఎన్ రాజు ఎమ్మెల్యేను కోరాగా అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో దేవాదాయ శాఖ ఏసీ టి. అన్నపూర్ణ, భీమిలి ఆర్డీఓ కె. సంగీత్ మాథూర్, నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ సింహాచలం నాయుడు, ఎంపీపీ కె. రాంబాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, భీమిలి ఏఎంసీ చైర్మన్ రామస్వామినాయుడు, డైరెక్టర్ నందిని, ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, ఎంపీడీఓ రూపేష్, తహశీల్దారు ఆనందరావు, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి లీలా ప్రసాద్, విద్యుత్ ఏఈ జగన్మోహన్, టీడీపీ నాయకులు చిక్కాల విజయబాబు, మండల పార్టీ అధ్యక్షుడు రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, కేవీ సత్యనారాయణ, గంటా నూకరాజు, బీఆర్‌బీ నాయుడు, శివాజీ, వైసీపీ నాయకులు పద్దు, సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు మహేశ్, రాము, నారాయణరావు పాల్గొన్నారు.


భీమిలి తీరంలో పుణ్య స్నానాలు, పూజలు


భీమిలి శివ, కేశవ ఆలయాల ఆవరణలో దీపారాధన


సింహాచలం పుష్కరిణిలో దీపారాధనలు

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


పద్మనాభంలో జ్వాలా తోరణం


పద్మనాభంలోని నరసాపురంలో పూజలు

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ కార్తీక పౌర్ణమి బుధవారం ఘనంగా నిర్వహించారు. భీమునిపట్నంలో గోస్తనీ, సాగర సంగమం తీరానికి వేకువజామున నాలుగున్నర నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి, పుణ్య స్నానాలు ఆచరించారు. ఐదు గంటల నుంచి ఆలయాలకు భక్తులు రాక ప్రారంభమైంది. లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, బాలాత్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల ధ్వజస్తంభాల వద్ద, నందీశ్వరుల వద్ద, రావిచెట్టు, ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేశారు. రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయం, జగన్నాథస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద కూడా భక్తులు దీపారాధన చేశారు. కాగా రుషికొండ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు స్టేషన్, భీమిలి స్టేషన్ సీఐలు శ్రీనివాసరావు, తిరుమలరావు ఆధ్వర్యంలో తీరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, భక్తులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పది వేల మంది సముద్ర స్నానాలు చేశారని ఎస్ఐ భరత్‌కుమార్ రాజు, మైరైన్ సీఐ శ్రీనివాసరావు తెలి పారు.

పద్మనాభంలో..

పద్మనాభం/ పద్మనాభం రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతవరం శ్రీమన్నారాయణేశ్వ ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు, కుంకమార్చనలు జరిగాయి. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద, నందీశ్వరుడు వద్ద దీపాలు వెలిగించారు. అలాగే తునివలస, నరసాపురం, మద్ది గ్రామాల్లోనూ పూజలు జరిగాయి. పద్మనాభంలోని నారాయణేశ్వరాలయం, పొట్నూరు ఉమా నీలకంఠేశ్వరాలయం, రెడ్డిపల్లి ఉమా రామలింగేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మనాభంలోని నారాయణేశ్వరాలయంలో సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను పల్లకీపై ఊరేగించారు. అనంతరం జ్వాలా తోరణం ఏర్పాటు చేసి వెలిగించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, సర్పంచ్ పాప, పద్దు దంపతులు, కోటి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు. కోరాడ పంచాయతీ గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం రాత్రి మహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పరమ శివునికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలతో అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించి, జ్వాలా తోరణం వెలిగించారు.

సింహాచలంలో..

సింహాచలం : సూర్యోదయానికి ముందే నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు కొండ దిగువన పుష్కరిణికి చేరుకుని స్నానాలు ఆచరించారు. అనంతరం సింహగిరి క్షేత్ర పాలకుడు బాల త్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామికి, రాజగోపురానికి చేరువలోని కాశీవిశ్వేశ్వరునికి పూజలు,అభిషేకాలు చేశారు.

అష్టలక్ష్మీ దేవాలయంలో..

కొమ్మాది : అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష్మీ నారాయణులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా పంచామృత, సుగంధ జలాభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు.

ఆలయాలు కిటకిట

ఎండాడ : ఎండాడలో కోదండ రామాలయం, పశుపతినాథేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకుడు సునరపు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం జ్వాలా తోరణం వెలిగించారు. అలానే కైలాసగిరి పోలీసు క్వార్టర్స్ సమీపంలో ఉన్న భవానీ సమేత కైలాసాగిరీశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశాలాక్షినగర్‌లో ఉన్న విశాలాక్షిసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఆర్‌డీఓ

పద్మనాభం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పని చేసి, ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆదేశించారు. బుధవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రీసర్వేలో వచ్చిన ఫిర్యాదులు, పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కాకర ఆనందరావు, డీటీ కె.చంద్రశేఖర్, సీఎస్ డీటీ శ్రీనివాసరావు, సర్వేయర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 4 లక్షల విరాళం

సింహాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబ దాతలు నలుగురు పేరిట రూ.4 లక్షలు విరాళంగా సమర్పించారు. సీహెచ్ శంకరరావు, అమృత పల్లవి, తన్వి, టి. దామోదర్ పేరున శంకరరావు విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు బుధవారం అందజేశారు. దాతలకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించారు.

పౌష్టికాహారం కిట్లు పంపిణీ

మధురవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో టీబీ రోగులకు వైద్యాధికారి దీపికాదేవి బుధవారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. గోధుమ పిండి, చిక్కీలు, రాగి పిండి, కంది పప్పు, ప్రోటీన్ పౌడర్ తదితర ఏడు రకాల పౌష్టికాహారాన్ని 70 మందికి అందించారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ ల్యాబ్ పర్యవేక్షకుడు వి.వీరబ్రహ్మం, పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


రాధాకృష్ణులను దర్శించుకున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

వైభవంగా రాధాకృష్ణ మహోత్సవం

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :భీమిలిలో రాధాకృష్ణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తొలుత రాధాకృష్ణ ఆలయం వద్ద అక్కరమాని వెంకట్రావు, విజయనిర్మల దంపతులు, అక్కరమాని అవినాశ్ దంపతుల ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎస్ఎంపురం నుంచి తప్పెటగుళ్లు, భీమిలిలోని కంచేరుపాలెం,నమ్మివానిపేట, చిప్పాడ మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. స్థానిక గొల్లవీధి మహిళలు కృష్ణ జంక్షన్ నుంచి యాదవ సంక్షేమ సంఘం నాయకుడు గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో కలశాలతో,కోలాటాలతో ప్రదర్శనగా ఆలయానికి వచ్చారు. భక్తులు ఎక్కువగా రావడంతో బీచ్ రోడ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం నాయకులు రామునాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, రమణ, ఎల్లయ్య, పిన్నింటి వెంకటరమణ, నరేంద్రకుమార్, రామ సూరప్పడు, పాల్గొన్నారు.

స్కూటీ హెడ్ లైట్‌లోకి దూరిన పాము



సాగర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ శివాలయం వద్ద స్కూటీ హెడ్ లైట్‌లోకి పసిరి పాము దూరింది.జోడుగుళ్లపాలెం ప్రాంతానికి చెందిన రాజు బుధవారం శివాలయం వద్ద స్కూటీని పార్కు చేసి దర్శనానికి వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి హెడ్ లైట్‌లోకి పాము పూర్తిగా దూరి తోక భాగం కొద్దిగా కనిపించింది. వెంటనే ఆయన వాహనాన్ని బీచ్ రోడ్డులో మెకానిక్ వద్దకు తీసుకువెళ్లి హెడ్ లైట్ విప్పించి, పామును బయటకు తీశారు. కాగా లైట్ విప్పే క్రమంలో పాము మృతి చెందింది.

'దుకాణాల అద్దె పెంచొద్దు'

సింహాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానానికి చెందిన పురూరవ సత్రంలోని దుకాణాల అద్దె పెంపుపై పునరాలోచన చేయాలని 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం దేవస్థానం ఈఓ సుజాతను కోరారు. బుధవారం ఆయన ఈఓకు వినతిపత్రం అందించారు. అలాగే సింహగిరిపై నూతన దుకాణాల సముదాయానికి పీఆర్ఓ కార్యాలయం ఎదురుగా మార్గాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈఓను కలిసిన వారిలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకుడు గుసిడి అవినాష్, కొందరు వ్యాపారులు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

మధురవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏసీబీ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏసీబీ సీఐ మహేశ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు అధికారులు కార్యాలయం లోపలికి ప్రవేశించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారితో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. రోజువారీ నిర్వహించే ముఖ్యమైన రికార్డులతో పాటు కొన్ని పాత రికార్డులను పరిశీలించినట్టు తెలిసింది. అలాగే సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని కొన్ని రికార్డుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని కీలకమైన డాక్యుమెంట్లను వారితో పాటు తీసుకువెళ్లారు. సాయంత్రం 4 గంటల వరకు తనిఖీలు కొనసాగాయి.

ఉక్కులో తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ల (డీసీఎఫ్)తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ నుంచి మరో ఇద్దరేసి డీసీఎఫ్‌లను రప్పించారు. మొత్తం ఆరుగురు అధికారులు కలిసి మంగళవారం నుంచి స్టీల్‌ప్లాంటులో తనిఖీలు చేస్తున్నారు. నాలుగు రోజులు అన్నీ పరిశీలించి అంతా కలసి నివేదిక సమర్పిస్తారు. అందులో లోపాలపై సమీక్షించి, తక్షణమే వాటిని సరిచేయించాలనేది ప్రభుత్వం ఆలోచన.

ఇన్నాళ్లూ కాలుష్యంపైనే దృష్టి

కొన్ని దశాబ్దాలుగా ఫ్యాక్టరీస్ విభాగం స్టీల్ ప్లాంటును తనిఖీలు చేస్తోంది. వారు ఎప్పుడు ఉద్యోగుల భద్రత, యంత్రాల నిర్వహణపై దృష్టి పెట్టలేదు. ప్రతిసారి గాలి నాణ్యత బాగుండాలని, ధూళి రేగకుండా చూడాలని, వ్యర్థ జలాలను శుద్ధి చేయాలనే సూచనలు చేస్తూ వచ్చారు. భారీ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగితే...అవి ఎలా జరిగాయి? అని వివరణ మాత్రమే తీసుకునేవారు.

నిర్వహణపైనే ఈసారి తనిఖీలు

నిధులు లేవనే కారణంతో నాలుగేళ్లుగా ప్లాంటు నిర్వహణను గాలికి వదిలేశారు. సముద్ర తీర ప్రాంతం కావడంతో యంత్రాలు త్వరగా తుప్పుపడతాయి. దానిని ఎప్పటికప్పుడు తొలగించి పెయింట్లు వేయాల్సి ఉంటుంది. అలాగే మరమ్మతుల కోసం కొన్ని విభాగాలను కొంతకాలం మూసేయాలి. విడి భాగాలు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ప్లాంటులో ఏ విభాగంలోను విడి భాగాలు లేవు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు అత్యంత ప్రమాదకరంగా మారింది. కోక్ ఓవెన్ బ్యాటరీలు పాతవైపోయాయి. ఇలా అన్ని విభాగాల్లో ఇబ్బందులు ఉన్నాయి. ఇవన్నీ ప్రత్యేక తనిఖీల్లో బయటపెడతారా?, లేదా?...అనేది ఇప్పుడు అనుమానంగా ఉంది. ఈ తనిఖీలు పారదర్శకంగా చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏసీబీ సోదాలు

... 5వ పేజీ తరువాయి

భయపడి ఆఫీస్‌లో ఈ వ్యవహారాలను నడపడం లేదు. రిజిస్ట్రేషన్ల సమయంలోనే కక్షిదారుల వద్ద డాక్యుమెంట్ రైటర్లు డబ్బులు తీసుకుంటారు. కొందరు వారి కార్యాలయంలో పెట్టి వస్తే...మరికొందరు నేరుగా జేబుల్లోనే పెట్టుకొని తిరుగుతారు. అందుకని ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్లను, వారి సహాయకులను కూడా సోదాలు చేశారు. సూపర్‌బజార్ కార్యాలయంలో ఉన్న ముగ్గురిని ఏసీబీ కార్యాలయానికి తీసుకువెళ్లారు.

ఎక్కువ లావాదేవీలే జరిగే కార్యాలయాలపైనే..

సూపర్ బజార్, మధురవాడల్లో ఎక్కువ లావాదేవీలు జరుగుతాయి. రోజుకు ఎలా లేదన్నా 20 నుంచి 30 వరకు డాక్యుమెంట్లు రిజిస్టర్ చేస్తారు. అందుకే ఏసీబీ అధికారులు ఈ కార్యాలయాలను ఎంచుకున్నట్టు సమాచారం. ఏసీబీ అధికారులు వారితో పాటు కొన్ని డాక్యుమెంట్లను, రిజిస్టర్లను కూడా తీసుకువెళ్లారు. విశాఖ జిల్లా రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌ను పిలిపించి, వారి ఎదుట స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. అధికారులను నిర్బంధించడం వల్ల ఆయా కార్యాలయాల్లో లావాదేవీలు పూర్తిస్థాయిలో జరగలేదు. చాలామందిని బయటే ఉంచేశారు.

డీసీసీబీలో దందాపై ఆప్కాబ్ ఆరా

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలోని బ్రాంచిలో పోస్టింగ్ ఇచ్చారనేది మరో ఆరోపణ. కాగా వాహన కంపెనీ షోరూమ్ ప్రతినిధి ఒకరు ప్రతిరోజు బ్యాంకుకు వచ్చి కీలక వ్యక్తి చాంబర్‌లో కూర్చుని పెత్తనం చలాయిస్తున్నారనే సిబ్బంది చెబుతున్నారు. ఆయన వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తంచేసినా పెద్దలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు తెలిసింది. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సదరు ప్రైవేటు వ్యక్తి ఫోన్ చేసి ప్రతినెలా కొంత మామూళ్ల కింద ఇవ్వాలని ఒత్తిడి తీసుకురావడంతో అనకాపల్లి జిల్లాలో పలు సొసైటీలకు చెందిన ఉద్యోగులు తమ పరిధిలో కూటమి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. సొసైటీలు నష్టాల్లో నడుస్తున్నాయని, ఇటువంటి తరుణంలో ఈ దందా ఏమిటని వాపోయినట్టు చెబుతున్నారు. డీసీసీబీలో పదోన్నతుల వ్యవహారంలో సొమ్ముల వసూళ్లపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం రావడంతో విజయవాడలోని ఆప్కాబ్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఎంతమందికి పదోన్నతి ఇచ్చారు?, వారిలో అనర్హులు ఉన్నారా?, పదోన్నతి పొందిన వారి నుంచి ఏ మేరకు వసూలు చేశారు?, పదోన్నతి పొందిన వారి వివరాలు పంపాలని బ్యాంకు ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆప్కాబ్ ప్రతినిధులు నగరంలోని డీసీసీబీని తనిఖీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

మత్స్యకారులకు రేషన్ పంపిణీ



మత్స్యకారులకు నిత్యావసరాలు అందజేస్తున్న జేడీ లక్ష్మణరావు, భాస్కర్

బీచ్‌రోడ్డు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదజాలారిపేటలో మత్స్యకారులకు బుధవారం 50 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. జిల్లాలో 13 వేల మంది మత్స్యకారులకు రేషన్ పంపిణీలో భాగంగా నగరంలో పలుచోట్ల రేషన్ పంపిణీని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ పర్యవేక్షించారు. రెండు, మూడు రోజుల్లో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీలో పూర్తిచేసేలా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశించారు.

నిధులున్నా.. వంతెన నిర్మాణంపై నిర్లక్ష్యం

- శంకుస్థాపన జరిగినా మొదలు కాని పనులు
- 2, 6 సెక్టర్ల మధ్య గెడ్డపై కలగానే బ్రిడ్జి నిర్మాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఎన్నాళ్లీ కష్టాలంటూ స్థానికుల అసంతృప్తి



వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ఇరుకైన రహదారి మార్గమిదే..

ఎంవీపీ కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసం 18వ వార్డులోని ఎంవీపీ కాలనీ రెండో సెక్టర్ నుంచి ఆరో సెక్టర్‌కు వెళ్ల మార్గంలో వంతెన నిర్మాణం నెరవేరని కలగానే మిగిలిపోతోంది. ఇరుకుగా ఉండే ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే... పెద్ద వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అవుతుందని ఈ ప్రాంతీయులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. ఈ వంతెన పనులకు నిధులు మంజూరై నాలుగు కిందట టెండర్ కూడా ఖరారైంది. దీంతో ఇన్నాళ్ల తమ సమస్యలు తీరుతాయని స్థానికులు ఆనందపడ్డారు. అయితే ఇప్పటికీ ప్రాథమిక పనులు కూడా ప్రారంభం కాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఎంవీపీ కాలనీ రెండు, ఆరు సెక్టర్లను విడదీసే విధంగా గెడ్డ ప్రవహిస్తోంది. ముడసర్లోవ నుంచి, హనుమంతువాక మీదుగా గెడ్డ కాలువ ఎంవీపీలోని పలు సెక్టర్ల నుంచి సముద్రంలోకి కలుస్తుంది. పలు చోట్ల వంతెనలు వెడల్పుగానే ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం వంతెన ఇరుగ్గా ఉంది. నిర్మాణంలో నాలుగు మీటర్ల వెడల్పు ఉన్నా, ఇటూ అటూ రక్షణ గోడల వల్ల రహదారి ఇరుకైంది. దీంతో.. ఒకేసారి రెండు ఆటోలు ఎదురెదురుగా వచ్చినా.. ఒకటి వంతెన చివరి భాగంలో నిలిచిపోవాల్సి వస్తోంది. వంతెనకు ఓ వైపు రెండో సెక్టరు ఉంటుంది. సరిగ్గా ఇక్కడి వరకూ ఎంవీపీ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి, అలాగే వెంకోజీపాలెం వైపు ఉన్న ప్రధాన రహదారి నుంచి విశాలమైన రహదారి ఉంది. కాస్తా భారీ వాహనాలు ఏవి వచ్చినా, ఈ వంతెన మీదుగా వెళ్లే అవకాశాలు లేవు. దీంతో వెనక్కు వెళ్లి మరోదారి వెతుక్కోవాల్సి ఉంటుంది. తాజా విస్తరణతో ఈ కష్టాలన్నీ తీరే అవకాశం ఉంది. కానీ పనులు మాత్రం మొదలు కాలేదు.

కార్పొరేటరు గొలగాని మంగవేణి వినతి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో ఎట్టకేలకు జీవీఎంసీ రూ.39 లక్షలు మంజూరు చేసింది. విస్తరణ పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. ప్రస్తుతం ఉన్న వంతెన పద్నాలుగు అడుగుల పొడవు, పన్నెండు అడుగుల వెడల్పు ఉంది. తాజా విస్తరణలో మరో పన్నెండు అడుగుల వెడల్పు చేయనున్నారు. మూడు నుంచి, నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసకువస్తామని అధికారులు చెప్పినా, ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. సత్వరం పనులు ప్రారంభించి, విశాలమైన వంతెన అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సైన్స్, సాంకేతికతతో ఎంతో ప్రయోజనం

- డీఈవో ప్రేమ్‌కుమార్
- ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ప్రదర్శన కార్యక్రమం



స్మార్ట్ అగ్రికల్చర్ డ్రామా ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సైన్సు, సాంకేతిక రంగాల వల్ల మానావళికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్.ప్రేమకుమార్ పేర్కొన్నారు. బుధవారం తోటగరువు ఉన్నత పాఠశాలలో డీఈవో ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్సు డ్రామా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల ప్రభుత్వ యాజమాన్యంలో గల 15 పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూలు ఎడ్యుకేషన్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఈ డ్రామాలో ఉమెన్ ఇన్ సైన్సు పార్క్, అగ్రికల్చర్, డిజిటల్ ఇండియా, హైజిన్ ఫర్ ఆల్, గ్రీనర్ టెక్నాలజీ అనే 5 ఉప అంశాలపై ఈ పోటీలునిర్వహించినట్టు చెప్పారు. ఈ పోటీల్లో పెందుర్తిలో గల జిల్లా పరిషత్తు శాంతినగర్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ అగ్రికల్చర్ ప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు డీఈవో తెలిపారు. గైడ్‌గా టీచర్ ఎంవై సీతావరలక్ష్మి వ్యవహరించారు. రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక అనుసంధానం చేసి అధిక దిగుబడులను ఏ విధంగా సాధించవచ్చో ఈ నాటికలో వివరించారు.

అనంతరం తోటగరువు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు టి.రామకృష్ణ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి పి.రాజారావు, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు, రచయిత పీవీ రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరంజిల్లా విద్యాశాఖాధికారి, విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలను అందించారు.

కొండవాలు ప్రాంతంలో సమస్యలు పరిష్కరించండి

వెంకోజీపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, కాలువ, మెట్ల మార్గాలను మరమ్మతులు చేపట్టాలని వార్డు కార్పొరేటర్ అప్పారి (శ్రీ)విద్యకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. బుధవారం క్షేత్రపర్యటనలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన ఆమెకు స్థానికులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. మెట్లు సరిగా లేకపోవడంతో పైకి ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, అలాగే కాలువలు, డ్రైనేజీలు మరమ్మతులకు గురి కావడంతో మురుగునీరు మెట్లపై ప్రవహిస్తోందని వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్లి, నిధులను మంజూరు చేయించి మరమ్మతులను చేపడతామని స్థానికులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, టీడీపీ 15వ వార్డు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొట్టి జగదీశ్, ఎస్సీ కాలనీ అధ్యక్షుడు గురుమూర్తి, పెట్ల రాజు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

పెదవాల్తేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియేయా రేడియో సమీపంలోని జగన్నాథస్వామి ఆలయం దగ్గర సుమారు 65 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా, అక్కడి వారు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. గత నెల 29న అతడిని త్రీ టౌన్ కానిస్టేబుల్ కె.సతీష్ 108 వాహనంలో తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ ఈ నెల 2న సదరు వ్యక్తి మృతి చెందారు. త్రీ టౌన్ సీఐ పి.పైడియ్య పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన మురళీకి తెలియపరిచారు. దీంతో మృతి చెందిన వ్యక్తికి బుధవారం జ్ఞానపురం స్మశాన వాటికలో త్రీ టౌన్ కానిస్టేబుల్ సీహెచ్ ఈశ్వర్ సమక్షంలో అంత్యక్రియలను పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోం లెస్ షెల్టర్ మేనేజర్ మురళీ, సీపీ ఈశ్వర్ తదితరులు అంతక్రియలు నిర్వహించారు.

డీజిల్ ఆయిల్ సబ్సిడీ పెంచాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలవీరాంజనేయ స్వామికి ఫిషింగ్ హార్బర్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

బీచ్ రోడ్డు, నవంబర్ 5, (ఆంధ్రజ్యోతి) : డీజిల్ ఆయిల్ సబ్సిడీని పెంచాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి బుధవారం ఫిషింగ్ హార్బర్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. బోట్లకు రావాల్సిన డీజిల్ ఆయిల్ సబ్సిడీ గత కొద్ది రోజులుగా రావడం లేదని బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి బోటుకు నెలకు మూడు వేల లీటర్ల వరకు ఒక లీటర్‌కి తొమ్మిది రూపాయలు తగ్గించి హార్బర్‌లో ఆఫ్ కాఫ్ బంక్, హార్బర్‌లోని హెచ్‌పీసీఎల్, ఐవోసీ బంకుల ద్వారా డీజిల్, ఆయిల్‌ను పంపిణీ చేస్తున్నారన్నారు. సాధారణ ఖర్చులు లీటర్ ఒక్కింటికి రూ.1.50 పైసలు పోను బోట్ ఓనర్‌కు 7 రూపాయల 50 పైసలు వస్తుందన్నారు. బోటుకు రావాల్సిన సబ్సిడీ మొత్తం పీఎఫ్ఎంఎస్ ద్వారా బ్యాంక్ అకౌంట్‌కు బోటు ఓనర్లకు చెల్లించేవారన్నారు. గత ఆరు నెలలుగా రావాల్సిన డీజిల్ బకాయిలు సబ్సిడీ మొత్తం సుమారు రూ.2 ట్లు ఉంటుందని మంత్రికి వివరించారు. ప్రభుత్వం మత్స్యకారులకు డీజిల్ ఆయిల్‌పై సబ్సిడీ 15 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో 13 బోట్లు అగ్ని ప్రమాదం జరిగి తీవ్ర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. గత నెల 21నుంచి ఆయిల్ కార్డు పునరుద్ధరించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బోట్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ గౌరవాధ్యక్షుడు పీసీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో కార్తీక శోభ

- సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తజనం
- దీపారాధనలు, ప్రత్యేక పూజలు, దానాల సమర్పణ



బీచ్‌రోడ్డు : సముద్ర స్నానాల సందడి



పెదవాల్తేర్ : కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శివలింగం ఆకారంలో దీపారాధన

బీచ్ రోడ్డు, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద కాళికామాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివ నామస్మరణతో ఆలయం మారుమోగింది. దీపోత్సవంతో దేవాలయ ప్రాంగణం కళకళలాడింది. సముద్రంలో తెల్లవారుజామున అధిక సంఖ్యలో మహిళలు పుణ్య స్నానాలు ఆచరించారు.

పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం నుంచి వేలాది మంది భక్తులు సముద్ర స్నానాలకోసం తీర ప్రాంతానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల భక్తులకు ఇబ్బంది లేకుండా, అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. భద్రత ఏర్పాటు చేశారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) ! పెదవాల్తేరులోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు బుధవారం విశేష పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి కావడంతో పరిసర గ్రామాలు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి తెల్లవారు జాము నుంచే క్యూలైన్లలో నిల్చొన్నారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శివలింగ ఆకారంలో దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి, ఆలయ ప్రధాన అర్చకులు కాశీప్రసాద్, చిన అప్పారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డు : తీరంలో ఇసుకతో శివలింగాకృతులను చేసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భీమిలిలో ఆర్జేడీ పర్యటన



డైట్‌లో ఛాత్రోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడి విజయ్‌కుమార్

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలను ఆర్‌జేడీ బి.విజయకుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మూడవ సెమిస్టర్ మిడ్ టర్మ్ పరీక్షలను పరిశీలించి, నిర్వహణ, విద్యార్థుల హాజరు, తదితర విషయాలను సమీక్షించారు. అలాగే పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలను, జీవీఎంసీ పీఎస్ఎం హైస్కూల్‌ను కూడా సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా విధానం, పాఠశాలల వాతావరణం పరిశీలించారు. ఆయనతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, హెచ్ఎం తిరుమల శ్రీదేవి ఉన్నారు.

జనాభా గణనపై శిక్షణ



మాట్లాడుతున్న సెన్సస్ డైరెక్టర్ నివాస్

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జన గణనను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె. నివాస్ కోరారు. బుధవారం ఆయన జోనల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో జనాభా గణనపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకూ శిక్షణ జరుగుతుందన్నారు. జిల్లాలో భీమిలి జోన్‌లోని 2, 3 వార్డులను తొలి విడత జన గణనకు ప్రభుత్వం ఎంపిక చేసిందని చెప్పారు. కార్యక్రమంలో సెన్సస్ డెప్యూటీ డైరెక్టర్ దయాసాగర్, జీవీఎంసీ అసిస్టెంట్ కమిషనరు రమణమూర్తి, జడ్పీ అయ్యప్పనాయుడు, ఎంపీడీవో నరసింహం, ఈవో ఆర్డీ రమేశ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వైద్య విధానంపై సదస్సు

సాగర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఆరోగ్యాన్ని కాపాడడంలో సంప్రదాయ వైద్యుల పాత్ర ఎనలేనిదని టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా అన్నారు. భగవాన్ బిర్సా ముండా జన్ జాతీయ గౌరవ్ వర్స్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఏపీ గిరిజన సంప్రదాయ వైద్యం, పద్ధతులు అన్న అంశంపై రుషికొండలోని టీసీఆర్‌టీఎంలో బుధవారం సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ గిరిజనుల ఆరోగ్యాన్ని నిలబెట్టడంలో సంప్రదాయ వైద్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. 80 ఏళ్లుగా క్యాన్సర్ చికిత్సలో విశేష సేవలందించిన డాక్టర్ ఎస్ఎస్ వైద్యనారాయణమూర్తి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 62, బెండకాయలు 52, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 50, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 92, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

శివాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం విశాఖపట్నం లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షులు చోడె పట్టాభిరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ : అంకాలజిస్ట్ వంశీధర్

పద్మనాభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో ఉన్న బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయిస్తే క్యాన్సర్ ముప్పును తగ్గించవచ్చని ప్రముఖ అంకాలజిస్ట్, విందా ఆస్పత్రి ఎండీ డాక్టర్ వంశీధర్ పుట్రేవు అన్నారు. బుధవారం పద్మనాభం సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో గ్రామీణ వైద్యులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

మహిళలు, పురుషుల్లో వచ్చే క్యాన్సర్ రకాలు, వాటి లక్షణాలు, గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, మండల అధ్యక్షుడు ఆర్. అప్పారావు, కార్యదర్శి ప్రసాద్, ఎంవీ రమణ, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ, సమన్వయ లక్షణాలు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో యువతలో క్రమశిక్షణ, సమన్వయం, జట్టు భావన పెంపొందుతాయని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ పేర్కొన్నారు. బుధవారం ఉదయం బోరా వెంకట ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో విశాఖ పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు.అనంతరం ఆయన చేతులు మీదుగా విజేతలకు మొదటి బహుమతి లక్ష, రన్నరప్ జట్టుకు రూ.60 వేలుచొప్పున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, నిర్వాహకులు,స్థానిక ప్రజాప్రతి నిధులు,క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్, డీఆర్‌డీఏ, ఖాదీ బోర్డు సంయుక్తంగా బుధవారం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు, నిరుద్యోగులకు అవగాహన, వివిధ శాఖల బాధ్యత వంటి అంశాలను ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బెందాళం లక్ష్మీపతి, ఖాదీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ తదితరులు వివరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమాభిషేకాలు

వెంకోజీపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో బుధవారం మహిళలతో సామూహిక కుంకుమాభిషేకాలను చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తితో పూజను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దత్తతపై అవగాహన

ఆరిలోవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ వాతావరణంలో పెరిగిన బాలలు సామాజికమైన అవరోధాలు లేకుండా ఉన్నతమైన భవిషత్తుకు పొందగలని బాలల సంరక్షణ అధికారి కె.హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ ప్రత్యేక బాలికల సదనం, పరిశీలన గృహంలో ఇందిరానగర్‌లో గల ఆనందమార్గ్‌కు చెందిన బాలలకు బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ దత్తత మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు.


మురళీనగర్‌లో రామలింగేశ్వరాలయ ధ్వజస్తంభం వద్ద మహిళల దీపారాధన


రెడ్డి కంచరపాలెంలో...


డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ ఆలయంలో జ్వాలాతోరణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు


మురళీనగర్‌లోని ఉమారామలింగేశ్వర ఆలయంలో అర్ధనారీశ్వర అలంకారం

వైభవంగా కార్తీక దీపోత్సవం

మురళీనగర్/కంచరపాలెం/సీతమ్మధార/అక్కయ్యపాలెం/అల్లిపురం/డాబాగార్డెన్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని వివిధ ఆలయాల్లో అర్ధనారీశ్వరుని భక్తిశ్రద్ధలతో కొలిచారు. శివునిలో సగభాగం కోరిన పార్వతీదేవి అర్ధనారీశ్వరుని వరం పొంది నెరవేర్చుకున్న సందర్భంగా ఇళ్లలో కేదారేశ్వర వ్రతం చేసుకున్నారు. ఉదయం, సాయంత్రం శివాలయాలకు వెళ్లి దర్శించుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించి, అనంతరం జ్వాలా తోరణం కార్యక్రమంలో పాల్గొని ప్రదక్షిణలు చేశారు. ఆలయాల్లో దీప, సాలగ్రామ దానాలిచ్చారు. మురళీనగర్, బర్మాక్యాంప్, ఎన్‌జీజీవోస్‌కాలనీ ప్రాంతాల్లోని ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. మురళీనగర్ హైస్కూలు సమీపంలో వేకువ జాము నుంచి మహేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. మంచిలి భానుమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో అర్చక బృందం సాయంత్రం ఉమారామలింగేశ్వర ఆలయంలో అర్ధనారీశ్వర అలంకారం చేసింది. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం, ఆవరణల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మహాశివుని ఆరాధించారు. మాధవధార కొండ మీది ఆలయంలో సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం జ్వాలాతోరణం వేడుక చేపట్టారు. 49వవార్డు సత్యానగర్ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, బర్మాక్యాంపు శివాలయం భక్తులతో రద్దీగా మారాయి. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు చేశారు. తిక్కవానిపాలెం, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం, గొల్లకంచరపాలెం ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కార్తీక పౌర్ణమి పర్వదినం ప్రాధాన్యతను వివరించారు. మహిళలు దీపారాధన నిర్వహించారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, సీతంపేట పార్వతీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మహాశివుడికి హారతులిచ్చారు. ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేటర్ 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో బాలగౌరమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరమ్మ ఉత్సవాల్లో భాగంగా జ్వాలా తోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, సంఘ సభ్యులు హాజరయ్యారు. అల్లిపురం, జ్ఞానాపురం ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. 32వ వార్డు పరిధిలోని డీబీకే క్వార్టర్స్‌లోని శ్రీలక్ష్మీ వరసిద్ధి వినాయక భవాని శంకర ఆలయంలో జ్వాలా తోరణం ఘనంగా నిర్వహించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు, పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్సవంలో పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో ఈవో డి.సురేష్‌బాబా సారథ్యంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు జి.భార్గవశర్మ శైవ ఆగమ సంప్రదాయలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ సన్నిధిలో భక్తులు పంచాక్షరి మంత్రాన్ని పఠించారు. ఆలయ చరిత్రలో తొలిసారి రాత్రి 7 గంటలకు జ్వాలాతోరణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అల్లిపురంలో జ్వాలాతోరణ ఉత్సవం

అలరించిన కవి సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న భాగవతుల సత్యనారాయణమూర్తి

సీతంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షత వహించిన డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ కన్నతల్లి బిడ్డకు అన్నం తినిపించేలా కవులు భావాన్ని వ్యక్తీకరించాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి సూర్యారావు విశ్లేషిస్తూ కవితలు సమాజ శ్రేయస్సును కాంక్షించేలా ఉన్నాయన్నారు. చల్లా రాంబాబు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, సీహెచ్ చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, ఎం.పరమేశ్వరరావు, వెంకటేశ్వరదాస్ పాల్గొన్నారు.

'సీఐటీయూ సాంస్కృతిక ఉత్సవాలు విజయవంతం చేయాలి'

డాబాగార్డెన్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):సీఐటీయూ మహాసభల సందర్భంగా నిర్వహించే శ్రామిక సాంస్కృతిక ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, దాడి సత్యనారాయణ, యాదవ్‌కుమార్, నరవ ప్రకాశరావు, మంగరాజు, రమణమూర్తి, జోస్, దుష్యంతు, నాగభూషణం హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోర్టు, స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను నీరుగారుస్తూ, ఉద్యోగులను తొలగించి జీతభత్యాలు తగ్గిస్తూ, లేబర్‌కోడ్స్ పేరిట కార్మికులపై వేటు వేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ మహాసభలు విశాఖలో జరగనున్నందున సాంస్కృతిక సంబరాలను శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి.రమణ అధ్యక్షత వహించగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు


వేణుగోపాల్‌ను అభినందిస్తున్న ఎస్.వి.రమణ తదితరులు

కంచరపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సమయంలో అందించిన నిస్వార్థ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు ఎస్.వి.రమణ పేర్కొన్నారు. విశాఖ పోర్టులో కోర్టు సెక్రటరీగా విధులు నిర్వహించి పదోన్నతిపై డిప్యూటీ చైర్మన్‌గా పరదీప్ పోర్టుకు బదిలీ అయిన వేణుగోపాల్‌ను సంఘం ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌కు రమణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రొ.వెంకటరావు, ఎస్.సురేష్‌కుమార్, ఉమామహేశ్వరరావు, సింగ్, శివరామకృష్ణ అభినందించారు.

స్వీయరక్షణపై విద్యార్థులకు అవగాహన

అక్కయ్యపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్)పై అవగాహన కల్పించారు. మార్షల్ ఆర్ట్స్ ప్రతినిధులు హాజరై విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఎంఈవో బాలామణి, ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత విశాఖ కోసం కృషి

▸▸ జనసేన నాయకుడు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్ తదితరులు

సీతంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత (డ్రగ్స్ ఫ్రీ) విశాఖపట్నం కోసం విద్యాలయాలలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడతామని జనసేన నాయకుడు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో జనసేన, ఏబీవీపీ, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. విశాఖ రూపురేఖలు మారుతున్న తరుణంలో మాదక ద్రవ్యాల సేవనం పడగ విప్పుతోందని, వింధు పేరిట యువతను బానిసలుగా మార్చిన వైసీపీ నాయకత్వం సిగ్గు పడాలన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు యువజన, విద్యార్థి సంఘాలతో కలిసి సదస్సులు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం విద్యార్థులు, యువత సహకరించాలన్నారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మూడు నెలలకోసారి విశ్వవిద్యాలయాలు, కళాశాలలను టాస్క్‌ఫోర్స్ విభాగం తప్పనిసరిగా పర్యవేక్షించాలని కోరారు. విశాఖలో మాదక ద్రవ్యాల గొలుసు ఛేదించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు రత్నకాంత్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రసాద్, వెంకటేష్, వెంకయ్యనాయుడు, అవినాష్, బి.ప్రవీణ్, భావత, పోతు ప్రసాద్, దేవర రఘు పాల్గొన్నారు.

షట్టర్లు మూసి పారిపోయిన డాక్యుమెంట్ రైటర్లు



షట్టర్లు మూసేసి కనిపించిన డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు

మహారాణిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లోని సూపర్ మార్కెట్ వద్ద గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఇక్కడా తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో ఏసీబీ అధికారులు కార్యాలయం లోపలకు వెళ్లి తలుపులు మూసేసి సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఎవరినీ లోపలకు రానీయలేదు. దీనితో సమీపంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు వారి కార్యాలయాలు, షాపుల షట్టర్లను మూసేసి పరుగులు తీశారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన అనేక మంది బయట నిరీక్షించారు. అధికారుల నుంచి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం


చెక్‌ను అందజేస్తున్న దాత

సింహాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మహావిశాఖ నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురి పేరిట రూ.4 లక్షలను విరాళంగా సమర్పించారు. సీహెచ్ శంకరరావు, సీహెచ్ అమృత పల్లవి, సీహెచ్ తన్వి, టి.దామోదర్ పేరిట చెక్‌ను పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ ప్రవేశం కల్పించి, దర్శనం అనంతరం శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

మత్స్యకార మహిళలను గుర్తించాల్సిందే

▸▸ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కె.కనకారావు


మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు కనకారావు

డాబాగార్డెన్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార మహిళలను ఆర్థిక వ్యవస్థలకు కేంద్ర బిందువుగా గుర్తించాల్సిన అవసరముందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కె.కనకారావు అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో 'అంతర్జాతీయ మహిళా మత్స్యకార దినోత్సవం' నిర్వహించారు. కనకారావు మాట్లాడుతూ కేరళలో జరిగిన ఇండియా ఫిషర్ వుమెన్ అసెంబ్లీ, అంతర్జాతీయ మహిళా మత్స్యకార దినోత్సవాన్ని ఏటా నవంబరు 5న నిర్వహించాలని నిరుడు తీర్మానించిందన్నారు. మత్స్యకారుల పోరాటానికి వరల్డ్ ఫోరం ఆఫ్ ఫిషర్ పీపుల్స్ మద్దతుగా నిలుస్తోందని తెలిపారు. పాలకుల విధానాలతో సముద్ర దోపిడీ, వాతావరణ సంక్షోభం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ఫిష్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.లక్ష్మి మాట్లాడుతూ మత్స్యకార మహిళల జీవితం, సంస్కృతి, వాణిజ్య పనులలో వారి ప్రాధాన్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. మత్స్యకార మహిళల శ్రమను గుర్తించి ప్రభుత్వ, సహకార, సామాజిక సంస్థలలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అన్ని మత్స్యకార చట్టాలు, విధానాలలో హక్కుదారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న అతిథులు

జ్ఞానాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి (వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ హాజరయ్యారు. 2024-25 సంవత్సరానికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 200 మంది విద్యార్థినులకు అతిథులు పట్టాలు, బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీకే జయలక్ష్మి, డాక్టర్ టి.భాస్కరసుధ, డా.వి.సోనీ, డా.సుజాత, సిస్టర్ హేమ, ఆనీ పాల్, మేరీ నాన్సీ తదితరులు పాల్గొన్నారు..

ఆ మార్గాల్లో రాకపోకలు సవాలే!


మెట్టు నుంచి జాషువానగర్ వెళ్లే రోడ్డు ఇలా...

కంచరపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి జాషువానగర్ మీదుగా జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలే ఎదురవుతున్నాయి. అసలే చిన్న రోడ్డు కావడం, అందులో సగం వరకు తోపుడు బండ్లు, చిరువర్తకులతో ఆక్రమణకు గురికావడంతో రాకపోకలకు అవస్థలు తప్పడంలేదు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు అసహనానికి గురవుతుంటారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర సమయాల్లో 108, అగ్నిమాపక వాహనాలు కూడా రాలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బాబోయ్ గోతులు!

సీతమ్మధార, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం రామాలయానికి వెళ్లే రహదారి మధ్యలో గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. కొద్ది రోజుల క్రితం మంచినీటి పైపులైన్ కోసం గోతులు తవ్వారు. అనంతరం పైపైన మట్టి వేసి వదిలేశారు. దీంతో వర్షాలకు గోతుల్లోని మట్టి కిందికి దిగిపోయింది. దీంతో రహదారి మధ్య పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో సంచరించే పిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులు కనిపిస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు వాపోతున్నారు. బాటసారులకు ఇబ్బందికరంగా ఉండే ఈ గోతులను వెంటనే పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


నక్కవానిపాలెం రామాలయానికి వెళ్లే వీధిలో ప్రమాదకరంగా ఉన్న గోతులు

'ఉత్తర'లో సీసీ రోడ్ల నవీకరణ


కళింగనగర్‌లో కొత్తగా వేసిన రోడ్డు

మురళీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు(బీజేపీ) చొరవతో ఏళ్ల నాటి ప్రతిపాదనలు ఇపుడు కార్యరూపం దాల్చుతున్నాయి. 51వ వార్డులో 48ఎ బస్ రూట్‌ను ఆనుకొని ఉన్న కళింగనగర్ ప్రాంత రహదారికి మోక్షం లభించింది. అయిదేళ్లుగా ఈ ప్రాంతీయులు ఎన్ని సార్లు వినతిపత్రాలు అందించినా నెరవేరని పనులు, కూటమి పాలనలో ఏడాదిన్నరలోనే కొత్త సౌకర్యాలు స్థానికులను పలకరిస్తున్నాయి. డ్రైన్లతోపాటు కళింగనగర్ నివాసితుల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్లు నిర్మించారు. పనులు పూర్తిచేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేధింపులు, వెక్కిరింతలు

... 5వ పేజీ తరువాయి

వేయడం తప్పా?...అని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఆ ఉత్సవాలన్నీ దాతల ఖర్చుతోనే

కనకమహాలక్ష్మి ఆలయానికి జగదాంబ సెంటర్‌లో సీతారామ స్వామి ఆలయం కూడా ఉంది. అక్కడ ఇటీవల ఉత్సవాలు నిర్వహించినప్పుడు ఆ ఖర్చు అంతా దాతలే పెట్టుకున్నారు. అయితే అంతా దేవస్థానం నుంచే ఖర్చు చేసినట్టు బిల్లులు పెట్టుకున్నారని ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుండగా కనకమహాలక్ష్మి ఆలయంలో అందరి ముందు ఓ మహిళా ఉద్యోగిని పట్టుకొని సదరు అధికారి గట్టిగా గదమాయించినట్టు తెలిసింది. ఇలా అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరినీ అకారణంగా నిందిస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధికారితో మార్గశిర ఉత్సవాలు నిర్వహించడం కత్తిమీద సామేనని సిబ్బంది వాపోతున్నారు

డీసీసీబీలో దందాపై ఆప్కాబ్ ఆరా

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలోని బ్రాంచిలో పోస్టింగ్ ఇచ్చారనేది మరో ఆరోపణ.

కాగా వాహన కంపెనీ షోరూమ్ ప్రతినిధి ఒకరు ప్రతిరోజు బ్యాంకుకు వచ్చి కీలక వ్యక్తి ఛాంబర్‌లో కూర్చుని పెత్తనం చలాయిస్తున్నారనే సిబ్బంది చెబుతున్నారు. ఆయన వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తంచేసినా పెద్దలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు తెలిసింది. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సదరు ప్రైవేటు వ్యక్తి ఫోన్ చేసి ప్రతినెలా కొంత మామూళ్ల కింద ఇవ్వాలని ఒత్తిడి తీసుకురావడంతో అనకాపల్లి జిల్లాలో పలు సొసైటీలకు చెందిన ఉద్యోగులు తమ పరిధిలో కూటమి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. సొసైటీలు నష్టాల్లో నడుస్తున్నాయని, ఇటువంటి తరుణంలో ఈ దందా ఏమిటని వాపోయినట్టు చెబుతున్నారు. డీసీసీబీలో పదోన్నతుల వ్యవహారంలో సొమ్ముల వసూళ్లపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం రావడంతో విజయవాడలోని ఆప్కాబ్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఎంతమందికి పదోన్నతి ఇచ్చారు?, వారిలో అనర్హులు ఉన్నారా?, పదోన్నతి పొందిన వారి నుంచి ఏ మేరకు వసూలు చేశారు?, పదోన్నతి పొందిన వారి వివరాలు పంపాలని బ్యాంకు ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆప్కాబ్ ప్రతినిధులు నగరంలోని డీసీసీబీని తనిఖీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

సీఎం చేతులమీదుగా పట్టాలు పంపిణీ?

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు సూచనలు చేశారు. వేలాది మంది పేదల ఇళ్ల క్రమబద్ధీకరణకు వస్తున్న దరఖాస్తులను అధికారులు ఆమోదిస్తున్నారని, ఈ నేపథ్యంలో నగరంలో భారీ సభ నిర్వహించి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తే బాగుంటుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రతిపాదించారు. భాగస్వామ్య సదస్సు కోసం ఏయూలో భారీ వేదిక నిర్మిస్తున్నారని, ఆ కార్యక్రమం ముగిసిన రెండు, మూడు రోజులకు అదే వేదికపై పట్టాలు పంపిణీ చేయాలన్నారు. నగరంలో ఇప్పటివరకూ 12 వేల దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొనగా, మంత్రి స్పందిస్తూ సీఎంతో చర్చించిన తరువాత పట్టాలు పంపిణీ చేద్దామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో ప్రభుత్వ న్యాయవాదుల నుంచి అనుకున్న సహకారం రావడం లేదని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ప్రస్తావించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దక్షిణ నియోజకవర్గంలోని కల్లుపాకల ఏరియాలో ఒక జమీందారుకు చెందిన రెండు ఎకరాలు తీసుకుని పట్టాలు పంపిణీ చేశారని, ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదని దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకురాగా అధికారుల నుంచి వివరాలు తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు.

ఏసీబీ సోదాలు

... 5వ పేజీ తరువాయి

భయపడి ఆఫీస్‌లో ఈ వ్యవహారాలను నడపడం లేదు. రిజిస్ట్రేషన్ల సమయంలోనే కక్షిదారుల వద్ద డాక్యుమెంట్ రైటర్లు డబ్బులు తీసుకుంటారు. కొందరు వారి కార్యాలయంలో పెట్టి వస్తే...మరికొందరు నేరుగా జేబుల్లోనే పెట్టుకొని తిరుగుతారు. అందుకని ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్లను, వారి సహాయకులను కూడా సోదాలు చేశారు. సూపర్‌బజార్ కార్యాలయంలో ఉన్న ముగ్గురిని ఏసీబీ కార్యాలయానికి తీసుకువెళ్లారు.

ఎక్కువ లావాదేవీలే జరిగే కార్యాలయాలపైనే..

సూపర్ బజార్, మధురవాడల్లో ఎక్కువ లావాదేవీలు జరుగుతాయి. రోజుకు ఎలా లేదన్నా 20 నుంచి 30 వరకు డాక్యుమెంట్లు రిజిస్టర్ చేస్తారు. అందుకే ఏసీబీ అధికారులు ఈ కార్యాలయాలను ఎంచుకున్నట్టు సమాచారం. ఏసీబీ అధికారులు వారితో పాటు కొన్ని డాక్యుమెంట్లను, రిజిస్టర్లను కూడా తీసుకువెళ్లారు. విశాఖ జిల్లా రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌ను పిలిపించి, వారి ఎదుట స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. అధికారులను నిర్బంధించడం వల్ల ఆయా కార్యాలయాల్లో లావాదేవీలు పూర్తిస్థాయిలో జరగలేదు. చాలామందిని బయటే ఉంచేశారు.

ఉక్కులో తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ల (డీసీఎఫ్)తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ నుంచి మరో ఇద్దరేసి డీసీఎఫ్‌లను రప్పించారు. మొత్తం ఆరుగురు అధికారులు కలిసి మంగళవారం నుంచి స్టీల్‌ప్లాంటులో తనిఖీలు చేస్తున్నారు. నాలుగు రోజులు అన్నీ పరిశీలించి అంతా కలసి నివేదిక సమర్పిస్తారు. అందులో లోపాలపై సమీక్షించి, తక్షణమే వాటిని సరిచేయించాలనేది ప్రభుత్వం ఆలోచన.

ఇన్నాళ్లూ కాలుష్యంపైనే దృష్టి

కొన్ని దశాబ్దాలుగా ఫ్యాక్టరీస్ విభాగం స్టీల్ ప్లాంటును తనిఖీలు చేస్తోంది. వారు ఎప్పుడు ఉద్యోగుల భద్రత, యంత్రాల నిర్వహణపై దృష్టి పెట్టలేదు. ప్రతిసారి గాలి నాణ్యత బాగుండాలని, ధూళి రేగకుండా చూడాలని, వ్యర్థ జలాలను శుద్ధి చేయాలనే సూచనలు చేస్తూ వచ్చారు. భారీ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగితే...అవి ఎలా జరిగాయి? అని వివరణ మాత్రమే తీసుకునేవారు.

నిర్వహణపైనే ఈసారి తనిఖీలు

నిధులు లేవనే కారణంతో నాలుగేళ్లుగా ప్లాంటు నిర్వహణను గాలికి వదిలేశారు. సముద్ర తీర ప్రాంతం కావడంతో యంత్రాలు త్వరగా తుప్పుపడతాయి. దానిని ఎప్పటికప్పుడు తొలగించి పెయింట్లు వేయాల్సి ఉంటుంది. అలాగే మరమ్మతుల కోసం కొన్ని విభాగాలను కొంతకాలం మూసేయాలి. విడి భాగాలు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ప్లాంటులో ఏ విభాగంలోను విడి భాగాలు లేవు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు అత్యంత ప్రమాదకరంగా మారింది. కోక్ ఓవెన్ బ్యాటరీలు పాతవైపోయాయి. ఇలా అన్ని విభాగాల్లో ఇబ్బందులు ఉన్నాయి. ఇవన్నీ ప్రత్యేక తనిఖీల్లో బయటపెడతారా?, లేదా?...అనేది ఇప్పుడు అనుమానంగా ఉంది. ఈ తనిఖీలు పారదర్శకంగా చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మత్స్యకారులకు రేషన్ పంపిణీ



మత్స్యకారులకు నిత్యావసరాలు అందజేస్తున్న జేడీ లక్ష్మణరావు, భాస్కర్

బీచ్‌రోడ్డు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదజాలారిపేటలో మత్స్యకారులకు బుధవారం 50 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. జిల్లాలో 13 వేల మంది మత్స్యకారులకు రేషన్ పంపిణీలో భాగంగా నగరంలో పలుచోట్ల రేషన్ పంపిణీని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ పర్యవేక్షించారు. రెండు, మూడు రోజుల్లో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీలో పూర్తిచేసేలా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశించారు.

నిధులున్నా.. వంతెన నిర్మాణంపై నిర్లక్ష్యం

- శంకుస్థాపన జరిగినా మొదలు కాని పనులు
- 2, 6 సెక్టర్ల మధ్య గెడ్డపై కలగానే బ్రిడ్జి నిర్మాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఎన్నాళ్లీ కష్టాలంటూ స్థానికుల అసంతృప్తి



వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ఇరుకైన రహదారి మార్గమిదే..

ఎంవీపీ కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ కాలనీ రెండో సెక్టర్ నుంచి ఆరో సెక్టర్‌కు వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణం నెరవేరని కలగానే మిగిలిపోతోంది. ఇరుకుగా ఉండే ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే... పెద్ద వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అవుతుందని ఈ ప్రాంతీయులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. ఈ వంతెన పనులకు నిధులు మంజూరై నాలుగు కిందట టెండర్ కూడా ఖరారైంది. దీంతో ఇన్నాళ్ల తమ సమస్యలు తీరుతాయని స్థానికులు ఆనందపడ్డారు. అయితే ఇప్పటికీ ప్రాథమిక పనులు కూడా ప్రారంభం కాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఎంవీపీ కాలనీ రెండు, ఆరు సెక్టర్లను విడదీసే విధంగా గెడ్డ ప్రవహిస్తోంది. ముడసర్లోవ నుంచి, హనుమంతువాక మీదుగా గెడ్డ కాలువ ఎంవీపీలోని పలు సెక్టర్ల నుంచి సముద్రంలోకి కలుస్తుంది. పలు చోట్ల వంతెనలు వెడల్పుగానే ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం వంతెన ఇరుగ్గా ఉంది. నిర్మాణంలో నాలుగు మీటర్ల వెడల్పు ఉన్నా, ఇటూ అటూ రక్షణ గోడల వల్ల రహదారి ఇరుకైంది. దీంతో.. ఒకేసారి రెండు ఆటోలు ఎదురెదురుగా వచ్చినా.. ఒకటి వంతెన చివరి భాగంలో నిలిచిపోవాల్సి వస్తోంది. వంతెనకు ఓ వైపు రెండో సెక్టరు ఉంటుంది. సరిగ్గా ఇక్కడి వరకూ ఎంవీపీ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి, అలాగే వెంకోజీపాలెం వైపు ఉన్న ప్రధాన రహదారి నుంచి విశాలమైన రహదారి ఉంది. కాస్తా భారీ వాహనాలు ఏవి వచ్చినా, ఈ వంతెన మీదుగా వెళ్లే అవకాశాలు లేవు. దీంతో వెనక్కు వెళ్లి మరోదారి వెతుక్కోవాల్సి ఉంటుంది. తాజా విస్తరణతో ఈ కష్టాలన్నీ తీరే అవకాశం ఉంది. కానీ పనులు మాత్రం మొదలు కాలేదు.

కార్పొరేటరు గొలగాని మంగవేణి వినతి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో ఎట్టకేలకు జీవీఎంసీ రూ.39 లక్షలు మంజూరు చేసింది. విస్తరణ పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. ప్రస్తుతం ఉన్న వంతెన పద్నాలుగు అడుగుల పొడవు, పన్నెండు అడుగుల వెడల్పు ఉంది. తాజా విస్తరణలో మరో పన్నెండు అడుగుల వెడల్పు చేయనున్నారు. మూడు నుంచి, నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసకువస్తామని అధికారులు చెప్పినా, ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. సత్వరం పనులు ప్రారంభించి, విశాలమైన వంతెన అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సైన్స్, సాంకేతికతతో ఎంతో ప్రయోజనం

- డీఈవో ప్రేమ్‌కుమార్
- ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ప్రదర్శన కార్యక్రమం



స్మార్ట్ అగ్రికల్చర్ డ్రామా ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సైన్సు, సాంకేతిక రంగాల వల్ల మానావళికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్.ప్రేమకుమార్ పేర్కొన్నారు. బుధవారం తోటగరువు ఉన్నత పాఠశాలలో డీఈవో ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్సు డ్రామా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల ప్రభుత్వ యాజమాన్యంలో గల 15 పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూలు ఎడ్యుకేషన్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఈ డ్రామాలో ఉమెన్ ఇన్ సైన్సు ఫార్మ్, అగ్రికల్చర్, డిజిటల్ ఇండియా, హైజిన్ ఫర్ ఆల్, గ్రీనర్ టెక్నాలజీ అనే 5 ఉప అంశాలపై ఈ పోటీలునిర్వహించినట్టు చెప్పారు. ఈ పోటీల్లో పెందుర్తిలో గల జిల్లా పరిషత్తు శాంతినగర్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ అగ్రికల్చర్ ప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు డీఈవో తెలిపారు. గైడ్‌గా టీచర్ ఎంవై సీతావరలక్ష్మి వ్యవహరించారు. రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక అనుసంధానం చేసి అధిక దిగుబడులను ఏ విధంగా సాధించవచ్చో ఈ నాటికలో వివరించారు.

అనంతరం తోటగరువు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు టి.రామకృష్ణ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి పి.రాజారావు, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు, రచయిత పీవీ రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరంజిల్లా విద్యాశాఖాధికారి, విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలను అందించారు.

కొండవాలు ప్రాంతంలో సమస్యలు పరిష్కరించండి

వెంకోజీపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, కాలువ, మెట్ల మార్గాలను మరమ్మతులు చేపట్టాలని వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. బుధవారం క్షేత్రపర్యటనలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన ఆమెకు స్థానికులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. మెట్లు సరిగా లేకపోవడంతో పైకి ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, అలాగే కాలువలు, డ్రైనేజీలు మరమ్మతులకు గురి కావడంతో మురుగునీరు మెట్లపై ప్రవహిస్తోందని వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్లి, నిధులను మంజూరు చేయించి మరమ్మతులను చేపడతామని స్థానికులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, టీడీపీ 15వ వార్డు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొట్టి జగదీశ్, ఎస్సీ కాలనీ అధ్యక్షుడు గురుమూర్తి, పెట్ల రాజు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

పెదవాల్తేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియేయా రేడియో సమీపంలోని జగన్నాథస్వామి ఆలయం దగ్గర సుమారు 65 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా, అక్కడి వారు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. గత నెల 29న అతడిని త్రీ టౌన్ కానిస్టేబుల్ కె.సతీష్ 108 వాహనంలో తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ ఈ నెల 2న సదరు వ్యక్తి మృతి చెందారు. త్రీ టౌన్ సీఐ పి.పైడియ్య పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన మురళీకి తెలియపరిచారు. దీంతో మృతి చెందిన వ్యక్తికి బుధవారం జ్ఞానపురం స్మశాన వాటికలో త్రీ టౌన్ కానిస్టేబుల్ సీహెచ్ ఈశ్వర్ సమక్షంలో అంత్యక్రియలను పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోం లెస్ షెల్టర్ మేనేజర్ మురళీ, సీపీ ఈశ్వర్ తదితరులు అంత్యక్రియలు నిర్వహించారు.

సాగర తీరంలో కార్తీక శోభ

- సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తజనం
- దీపారాధనలు, ప్రత్యేక పూజలు, దానాల సమర్పణ



బీచ్‌రోడ్డు : సముద్ర స్నానాల సందడి



పెదవాల్తేర్ : కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శివలింగం ఆకారంలో దీపారాధన

బీచ్ రోడ్డు, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద కాళికామాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివ నామస్మరణతో ఆలయం మారుమోగింది. దీపోత్సవంతో దేవాలయ ప్రాంగణం కళకళలాడింది. సముద్రంలో తెల్లవారుజామున అధిక సంఖ్యలో మహిళలు పుణ్య స్నానాలు ఆచరించారు.

పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం నుంచి వేలాది మంది భక్తులు సముద్ర స్నానాలకోసం తీర ప్రాంతానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల భక్తులకు ఇబ్బంది లేకుండా, అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. భద్రత ఏర్పాటు చేశారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) ! పెదవాల్తేరులోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు బుధవారం విశేష పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి కావడంతో పరిసర గ్రామాలు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి తెల్లవారు జాము నుంచే క్యూలైన్లలో నిల్చొన్నారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శివలింగ ఆకారంలో దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి, ఆలయ ప్రధాన అర్చకులు కాశీప్రసాద్, చిన అప్పారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డు : తీరంలో ఇసుకతో శివలింగాకృతులను చేసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భీమిలిలో ఆర్జేడీ పర్యటన



డైట్‌లో ఛాత్రోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడి విజయ్‌కుమార్

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలను ఆర్‌జేడీ బి.విజయకుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మూడవ సెమిస్టర్ మిడ్ టర్మ్ పరీక్షలను పరిశీలించి, నిర్వహణ, విద్యార్థుల హాజరు, తదితర విషయాలను సమీక్షించారు. అలాగే పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలను, జీవీఎంసీ పీఎస్‌ఎం హైస్కూల్‌ను కూడా సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా విధానం, పాఠశాలల వాతావరణం పరిశీలించారు. ఆయనతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి ఉన్నారు.

జనాభా గణనపై శిక్షణ



మాట్లాడుతున్న సెన్సస్ డైరెక్టర్ నివాస్

భీమునిపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జన గణనను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె. నివాస్ కోరారు. బుధవారం ఆయన జోనల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో జనాభా గణనపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకూ శిక్షణ జరుగుతుందన్నారు. జిల్లాలో భీమిలి జోన్‌లోని 2, 3 వార్డులను తొలి విడత జన గణనకు ప్రభుత్వం ఎంపిక చేసిందని చెప్పారు. కార్యక్రమంలో సెన్సస్ డెప్యూటీ డైరెక్టర్ దయాసాగర్, జీవీఎంసీ అసిస్టెంట్ కమిషనరు రమణమూర్తి, జడ్పీ అయ్యప్పనాయుడు, ఎంపీడీవో నరసింహం, ఈవో ఆర్డీ రమేశ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వైద్య విధానంపై సదస్సు

సాగర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఆరోగ్యాన్ని కాపాడడంలో సంప్రదాయ వైద్యుల పాత్ర ఎనలేనిదని టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమండా అన్నారు. భగవాన్ బిర్సా ముండా జన్ జాతీయ గౌరవ్ వర్స్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఏపీ గిరిజన సంప్రదాయ వైద్యం, పద్ధతులు అన్న అంశంపై రుషికొండలోని టీసీఆర్‌టీఎంలో బుధవారం సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ గిరిజనుల ఆరోగ్యాన్ని నిలబెట్టడంలో సంప్రదాయ వైద్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. 80 ఏళ్లుగా క్యాన్సర్ చికిత్సలో విశేష సేవలందించిన డాక్టర్ ఎస్ఎస్ వైద్యనారాయణమూర్తి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

డీజిల్ ఆయిల్ సబ్సిడీ పెంచాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలవీరాంజనేయ స్వామికి ఫిషింగ్ హార్బర్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

బీచ్ రోడ్డు, నవంబర్ 5, (ఆంధ్రజ్యోతి) : డీజిల్ ఆయిల్ సబ్సిడీని పెంచాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి బుధవారం ఫిషింగ్ హార్బర్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. బోట్లకు రావాల్సిన డీజిల్ ఆయిల్ సబ్సిడీ గత కొద్ది రోజులుగా రావడం లేదని బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి బోటుకు నెలకు మూడు వేల లీటర్ల వరకు ఒక లీటర్‌కి తొమ్మిది రూపాయలు తగ్గించి హార్బర్‌లో ఆఫ్ కాఫ్ బంక్, హార్బర్‌లోని హెచ్‌పీసీఎల్, ఐవోసీ బంకుల ద్వారా డీజిల్, ఆయిల్‌ను పంపిణీ చేస్తున్నారన్నారు. సాధారణ ఖర్చులు లీటర్ ఒక్కింటికి రూ.1.50 పైసలు పోను బోట్ ఓనర్‌కు 7 రూపాయల 50 పైసలు వస్తుందన్నారు. బోటుకు రావాల్సిన సబ్సిడీ మొత్తం పీఎఫ్‌ఎంఎస్ ద్వారా బ్యాంక్ అకౌంట్‌కు బోటు ఓనర్లకు చెల్లించేవారన్నారు. గత ఆరు నెలలుగా రావాల్సిన డీజిల్ బకాయిలు సబ్సిడీ మొత్తం సుమారు రూ.2 ట్లు ఉంటుందని మంత్రికి వివరించారు. ప్రభుత్వం మత్స్యకారులకు డీజిల్ ఆయిల్‌పై సబ్సిడీ 15 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో 13 బోట్లు అగ్ని ప్రమాదం జరిగి తీవ్ర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. గత నెల 21నుంచి ఆయిల్ కార్డు పునరుద్ధరించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బోట్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ గౌరవాధ్యక్షుడు పీసీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డ్యూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 62, బెండకాయలు 52, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 50, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 92, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

శివాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం విశాఖపట్నం లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షులు చోడె పట్టాభిరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ : అంకాలజిస్ట్ వంశీధర్

పద్మనాభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో ఉన్న బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయిస్తే క్యాన్సర్ ముప్పును తగ్గించవచ్చని ప్రముఖ అంకాలజిస్ట్, విందా ఆస్పత్రి ఎండీ డాక్టర్ వంశీధర్ పుట్రేవు అన్నారు. బుధవారం పద్మనాభం సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో గ్రామీణ వైద్యులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

మహిళలు, పురుషుల్లో వచ్చే క్యాన్సర్ రకాలు, వాటి లక్షణాలు, గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, మండల అధ్యక్షుడు ఆర్. అప్పారావు, కార్యదర్శి ప్రసాద్, ఎంవీ రమణ, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ, సమన్వయ లక్షణాలు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో యువతలో క్రమశిక్షణ, సమన్వయం, జట్టు భావన పెంపొందుతాయని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ పేర్కొన్నారు. బుధవారం ఉదయం బోరా వెంకట ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో విశాఖ పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు.అనంతరం ఆయన చేతులు మీదుగా విజేతలకు మొదటి బహుమతి లక్ష, రన్నరప్ జట్టుకు రూ.60 వేలుచొప్పున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, నిర్వాహకులు,స్థానిక ప్రజాప్రతి నిధులు,క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్, డీఆర్‌డీఏ, ఖాదీ బోర్డు సంయుక్తంగా బుధవారం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు, నిరుద్యోగులకు అవగాహన, వివిధ శాఖల బాధ్యత వంటి అంశాలను ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బెందాళం లక్ష్మీపతి, ఖాదీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ తదితరులు వివరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమాభిషేకాలు

వెంకోజీపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో బుధవారం మహిళలతో సామూహిక కుంకుమాభిషేకాలను చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తితో పూజను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దత్తతపై అవగాహన

ఆరిలోవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ వాతావరణంలో పెరిగిన బాలలు సామాజికమైన ఆవరోధాలు లేకుండా ఉన్నతమైన భవిషత్తుకు పొందగలని బాలల సంరక్షణ అధికారి కె.హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ ప్రత్యేక బాలికల సదనం, పరిశీలన గృహంలో ఇందిరానగర్‌లో గల ఆనందమార్గ్‌కు చెందిన బాలలకు బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ దత్తత మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు.



మురళీనగర్‌లో రామలింగేశ్వరాలయ ధ్వజస్తంభం వద్ద మహిళల దీపారాధన



రెడ్డి కంచరపాలెంలో...



డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ ఆలయంలో జ్వాలాతోరణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కార్తీక దీపోత్సవం



మురళీనగర్‌లోని ఉమారామలింగేశ్వర ఆలయంలో అర్ధనారీశ్వర అలంకారం

మురళీనగర్/కంచరపాలెం/సీతమ్మధార/అక్కయ్యపాలెం/అల్లిపురం/డాబాగార్డెన్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని వివిధ ఆలయాల్లో అర్ధనారీశ్వరుని భక్తిశ్రద్ధలతో కొలిచారు. శివునిలో సగభాగం కోరిన పార్వతీదేవి అర్ధనారీశ్వరుని వరం పొంది నెరవేర్చుకున్న సందర్భంగా ఇళ్లలో కేదారేశ్వర వ్రతం చేసుకున్నారు. ఉదయం, సాయంత్రం శివాలయాలకు వెళ్లి దర్శించుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభాల వద్ద దీపాలు వెలిగించి, అనంతరం జ్వాలా తోరణం కార్యక్రమంలో పాల్గొని ప్రదక్షిణలు చేశారు. ఆలయాల్లో దీప, సాలగ్రామ దానాలిచ్చారు. మురళీనగర్, బర్మాక్యాంప్, ఎన్‌జీజీవోస్‌కాలనీ ప్రాంతాల్లోని ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. మురళీనగర్ హైస్కూలు సమీపంలో వేకువ జాము నుంచి మహేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. మంచిలి భానుమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో అర్చక బృందం సాయంత్రం ఉమారామలింగేశ్వర ఆలయంలో అర్ధనారీశ్వర అలంకారం చేసింది. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం, ఆవరణల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మహాశివుని ఆరాధించారు. మాధవధార కొండ మీది ఆలయంలో సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం జ్వాలాతోరణం వేడుక చేపట్టారు. 49వవార్డు సత్యానగర్ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, బర్మాక్యాంపు శివాలయం భక్తులతో రద్దీగా మారాయి. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు చేశారు. తిక్కవానిపాలెం, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం, గొల్లకంచరపాలెం ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కార్తీక పౌర్ణమి పర్వదినం ప్రాధాన్యతను వివరించారు. మహిళలు దీపారాధన నిర్వహించారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, సీతంపేట పార్వతీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మహాశివుడికి హారతులిచ్చారు. ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేటర్ 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో బాల గౌరమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరమ్మ ఉత్సవాల్లో భాగంగా జ్వాలా తోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, సంఘ సభ్యులు హాజరయ్యారు. అల్లిపురం, జ్ఞానాపురం ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. 32వ వార్డు పరిధిలోని డీబీకే క్వార్టర్స్‌లోని శ్రీలక్ష్మీ వరసిద్ధి వినాయక భవాని శంకర ఆలయంలో జ్వాలా తోరణం ఘనంగా నిర్వహించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు, పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్సవంలో పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో ఈవో డి.సురేష్‌బాబా సారథ్యంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు జి.భార్గవశర్మ శైవ ఆగమ సంప్రదాయలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ సన్నిధిలో భక్తులు పంచాక్షరి మంత్రాన్ని పఠించారు. ఆలయ చరిత్రలో తొలిసారి రాత్రి 7 గంటలకు జ్వాలాతోరణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అల్లిపురంలో జ్వాలాతోరణ ఉత్సవం

'ఉత్తర'లో సీసీ రోడ్ల నవీకరణ



కళింగనగర్‌లో కొత్తగా వేసిన రోడ్డు

మురళీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు(బీజేపీ) చొరవతో ఏళ్ల నాటి ప్రతిపాదనలు ఇపుడు కార్యరూపం దాల్చుతున్నాయి. 51వ వార్డులో 48ఎ బస్ రూట్‌ను ఆనుకొని ఉన్న కళింగనగర్ ప్రాంత రహదారికి మోక్షం లభించింది. అయిదేళ్లుగా ఈ ప్రాంతీయులు ఎన్ని సార్లు వినతిపత్రాలు అందించినా నెరవేరని పనులు, కూటమి పాలనలో ఏడాదిన్నరలోనే కొత్త సౌకర్యాలు స్థానికులను పలకరిస్తున్నాయి. డ్రైన్లతోపాటు కళింగనగర్ నివాసితుల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్లు నిర్మించారు. పనులు పూర్తిచేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేధింపులు, వెక్కిరింతలు

... 5వ పేజీ తరువాయి

వేయడం తప్పా?...అని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఆ ఉత్సవాలన్నీ దాతల ఖర్చుతోనే

కనకమహాలక్ష్మి ఆలయానికి జగదాంబ సెంటర్‌లో సీతారామ స్వామి ఆలయం కూడా ఉంది. అక్కడ ఇటీవల ఉత్సవాలు నిర్వహించినప్పుడు ఆ ఖర్చు అంతా దాతలే పెట్టుకున్నారు. అయితే అంతా దేవస్థానం నుంచే ఖర్చు చేసినట్టు బిల్లులు పెట్టుకున్నారని ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుండగా కనకమహాలక్ష్మి ఆలయంలో అందరి ముందు ఓ మహిళా ఉద్యోగిని పట్టుకొని సదరు అధికారి గట్టిగా గదమాయించినట్టు తెలిసింది. ఇలా అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరినీ అకారణంగా నిందిస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధికారితో మార్గశిర ఉత్సవాలు నిర్వహించడం కత్తిమీద సామేనని సిబ్బంది వాపోతున్నారు

డీసీసీబీలో దందాపై ఆప్కాబ్ ఆరా

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలోని బ్రాంచిలో పోస్టింగ్ ఇచ్చారనేది మరో ఆరోపణ.

కాగా వాహన కంపెనీ షోరూమ్ ప్రతినిధి ఒకరు ప్రతిరోజు బ్యాంకుకు వచ్చి కీలక వ్యక్తి ఛాంబర్‌లో కూర్చుని పెత్తనం చలాయిస్తున్నారనే సిబ్బంది చెబుతున్నారు. ఆయన వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తంచేసినా పెద్దలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు తెలిసింది. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సదరు ప్రైవేటు వ్యక్తి ఫోన్ చేసి ప్రతినెలా కొంత మామ్మూళ్లు కింద ఇవ్వాలని ఒత్తిడి తీసుకురావడంతో అనకాపల్లి జిల్లాలో పలు సొసైటీలకు చెందిన ఉద్యోగులు తమ పరిధిలో కూటమి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. సొసైటీలు నష్టాల్లో నడుస్తున్నాయని, ఇటువంటి తరుణంలో ఈ దందా ఏమిటని వాపోయినట్టు చెబుతున్నారు. డీసీసీబీలో పదోన్నతుల వ్యవహారంలో సొమ్ముల వసూళ్లపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం రావడంతో విజయవాడలోని ఆప్కాబ్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఎంతమందికి పదోన్నతి ఇచ్చారు?, వారిలో అనర్హులు ఉన్నారా?, పదోన్నతి పొందిన వారి నుంచి ఏ మేరకు వసూలు చేశారు?, పదోన్నతి పొందిన వారి వివరాలు పంపాలని బ్యాంకు ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆప్కాబ్ ప్రతినిధులు నగరంలోని డీసీసీబీని తనిఖీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

సీఎం చేతులమీదుగా పట్టాలు పంపిణీ?

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు సూచనలు చేశారు. వేలాది మంది పేదల ఇళ్ల క్రమబద్ధీకరణకు వస్తున్న దరఖాస్తులను అధికారులు ఆమోదిస్తున్నారని, ఈ నేపథ్యంలో నగరంలో భారీ సభ నిర్వహించి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తే బాగుంటుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రతిపాదించారు. భాగస్వామ్య సదస్సు కోసం ఏయూలో భారీ వేదిక నిర్మిస్తున్నారని, ఆ కార్యక్రమం ముగిసిన రెండు, మూడు రోజులకు అదే వేదికపై పట్టాలు పంపిణీ చేయాలన్నారు. నగరంలో ఇప్పటివరకూ 12 వేల దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొనగా, మంత్రి స్పందిస్తూ సీఎంతో చర్చించిన తరువాత పట్టాలు పంపిణీ చేద్దామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో ప్రభుత్వ న్యాయవాదుల నుంచి అనుకున్న సహకారం రావడం లేదని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ప్రస్తావించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దక్షిణ నియోజకవర్గంలోని కల్లుపాకల ఏరియాలో ఒక జమీందారుకు చెందిన రెండు ఎకరాలు తీసుకుని పట్టాలు పంపిణీ చేశారని, ఇంతవరకూ పరిహారం ఇవ్వలేదని దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకురాగా అధికారుల నుంచి వివరాలు తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు.

ఏసీబీ సోదాలు

... 5వ పేజీ తరువాయి

భయపడి ఆఫీస్‌లో ఈ వ్యవహారాలను నడపడం లేదు. రిజిస్ట్రేషన్ల సమయంలోనే కక్షిదారుల వద్ద డాక్యుమెంట్ రైటర్లు డబ్బులు తీసుకుంటారు. కొందరు వారి కార్యాలయంలో పెట్టి వస్తే...మరికొందరు నేరుగా జేబుల్లోనే పెట్టుకొని తిరుగుతారు. అందుకని ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్లను, వారి సహాయకులను కూడా సోదాలు చేశారు. సూపర్‌బజార్ కార్యాలయంలో ఉన్న ముగ్గురిని ఏసీబీ కార్యాలయానికి తీసుకువెళ్లారు.

ఎక్కువ లావాదేవీలే జరిగే కార్యాలయాలపైనే..

సూపర్ బజార్, మధురవాడల్లో ఎక్కువ లావాదేవీలు జరుగుతాయి. రోజుకు ఎలా లేదన్నా 20 నుంచి 30 వరకు డాక్యుమెంట్లు రిజిస్టర్ చేస్తారు. అందుకే ఏసీబీ అధికారులు ఈ కార్యాలయాలను ఎంచుకున్నట్టు సమాచారం. ఏసీబీ అధికారులు వారితో పాటు కొన్ని డాక్యుమెంట్లను, రిజిస్టర్లను కూడా తీసుకువెళ్లారు. విశాఖ జిల్లా రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌ను పిలిపించి, వారి ఎదుట స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. అధికారులను నిర్బంధించడం వల్ల ఆయా కార్యాలయాల్లో లావాదేవీలు పూర్తిస్థాయిలో జరగలేదు. చాలామందిని బయటే ఉంచేశారు.

ఉక్కులో తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ల (డీసీఎఫ్)తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ నుంచి మరో ఇద్దరేసి డీసీఎఫ్‌లను రప్పించారు. మొత్తం ఆరుగురు అధికారులు కలిసి మంగళవారం నుంచి స్టీల్‌ప్లాంటులో తనిఖీలు చేస్తున్నారు. నాలుగు రోజులు అన్నీ పరిశీలించి అంతా కలసి నివేదిక సమర్పిస్తారు. అందులో లోపాలపై సమీక్షించి, తక్షణమే వాటిని సరిచేయించాలనేది ప్రభుత్వం ఆలోచన.

ఇన్నాళ్లూ కాలుష్యంపైనే దృష్టి

కొన్ని దశాబ్దాలుగా ఫ్యాక్టరీస్ విభాగం స్టీల్ ప్లాంటును తనిఖీలు చేస్తోంది. వారు ఎప్పుడు ఉద్యోగుల భద్రత, యంత్రాల నిర్వహణపై దృష్టి పెట్టలేదు. ప్రతిసారి గాలి నాణ్యత బాగుండాలని, ధూళి రేగకుండా చూడాలని, వ్యర్థ జలాలను శుద్ధి చేయాలనే సూచనలు చేస్తూ వచ్చారు. భారీ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగితే...అవి ఎలా జరిగాయి? అని వివరణ మాత్రమే తీసుకునేవారు.

నిర్వహణపైనే ఈసారి తనిఖీలు

నిధులు లేవనే కారణంతో నాలుగేళ్లుగా ప్లాంటు నిర్వహణను గాలికి వదిలేశారు. సముద్ర తీర ప్రాంతం కావడంతో యంత్రాలు త్వరగా తుప్పుపడతాయి. దానిని ఎప్పటికప్పుడు తొలగించి పెయింట్లు వేయాల్సి ఉంటుంది. అలాగే మరమ్మతుల కోసం కొన్ని విభాగాలను కొంతకాలం మూసేయాలి. విడి భాగాలు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ప్లాంటులో ఏ విభాగంలోను విడి భాగాలు లేవు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు అత్యంత ప్రమాదకరంగా మారింది. కోక్ ఓవెన్ బ్యాటరీలు పాతవైపోయాయి. ఇలా అన్ని విభాగాల్లో ఇబ్బందులు ఉన్నాయి. ఇవన్నీ ప్రత్యేక తనిఖీల్లో బయటపెడతారా?, లేదా?...అనేది ఇప్పుడు అనుమానంగా ఉంది. ఈ తనిఖీలు పారదర్శకంగా చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అలరించిన కవి సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న భాగవతుల సత్యనారాయణమూర్తి

సీతంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షత వహించిన డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ కన్నతల్లి బిడ్డకు అన్నం తినిపించేలా కవులు భావాన్ని వ్యక్తీకరించాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి సూర్యారావు విశ్లేషిస్తూ కవితలు సమాజ శ్రేయస్సును కాంక్షించేలా ఉన్నాయన్నారు. చల్లా రాంబాబు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, సీహెచ్ చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, ఎం.పరమేశ్వరరావు, వెంకటేశ్వరదాస్ పాల్గొన్నారు.

'సీఐటీయూ సాంస్కృతిక ఉత్సవాలు విజయవంతం చేయాలి'

డాబాగార్డెన్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):సీఐటీయూ మహాసభల సందర్భంగా నిర్వహించే శ్రామిక సాంస్కృతిక ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, దాడి సత్యనారాయణ, యాదవ్‌కుమార్, నరవ ప్రకాశరావు, మంగరాజు, రమణమూర్తి, జోస్, దుష్యంతు, నాగభూషణం హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోర్టు, స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను నీరుగారుస్తూ, ఉద్యోగులను తొలగించి జీతభత్యాలు తగ్గిస్తూ, లేబర్‌కోడ్స్ పేరిట కార్మికులపై వేటు వేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ మహాసభలు విశాఖలో జరగనున్నందున సాంస్కృతిక సంబరాలను శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి.రమణ అధ్యక్షత వహించగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



వేణుగోపాల్‌ను అభినందిస్తున్న ఎస్.వి.రమణ తదితరులు

కంచరపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సమయంలో అందించిన నిస్వార్థ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు ఎస్.వి.రమణ పేర్కొన్నారు. విశాఖ పోర్టులో కోర్టు సెక్రటరీగా విధులు నిర్వహించి పదోన్నతిపై డిప్యూటీ చైర్మన్‌గా పరదీప్ పోర్టుకు బదిలీ అయిన వేణుగోపాల్‌ను సంఘం ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌కు రమణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రొ.వెంకటరావు, ఎన్.సురేష్‌కుమార్, ఉమామహేశ్వరరావు, సింగ్, శివరామకృష్ణ అభినందించారు.

స్వీయరక్షణపై విద్యార్థులకు అవగాహన

అక్కయ్యపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్)పై అవగాహన కల్పించారు. మార్షల్ ఆర్ట్స్ ప్రతినిధులు హాజరై విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఎంఈవో బాలామణి, ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత విశాఖ కోసం కృషి

జనసేన నాయకుడు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్ తదితరులు

సీతంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత (డ్రగ్స్ ఫ్రీ) విశాఖపట్నం కోసం విద్యాలయాలలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడతామని జనసేన నాయకుడు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో జనసేన, ఏబీవీపీ, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. విశాఖ రూపురేఖలు మారుతున్న తరుణంలో మాదక ద్రవ్యాల సేవనం పడగ విప్పుతోందని, విందు పేరిట యువతను బానిసలుగా మార్చిన వైసీపీ నాయకత్వం సిగ్గు పడాలన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు యువజన, విద్యార్థి సంఘాలతో కలిసి సదస్సులు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం విద్యార్థులు, యువత సహకరించాలన్నారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మూడు నెలలకోసారి విశ్వవిద్యాలయాలు, కళాశాలలను టాస్క్‌ఫోర్స్ విభాగం తప్పనిసరిగా పర్యవేక్షించాలని కోరారు. విశాఖలో మాదక ద్రవ్యాల గొలుసు ఛేదించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు రత్నకాంత్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రసాద్, వెంకటేష్, వెంకయ్యనాయుడు, అవినాష్, బి.ప్రవీణ్, భావత, పోతు ప్రసాద్, దేవర రఘు పాల్గొన్నారు.

షట్టర్లు మూసి పారిపోయిన డాక్యుమెంట్ రైటర్లు



షట్టర్లు మూసేసి కనిపించిన డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు

మహారాణిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లోని సూపర్ మార్కెట్ వద్ద గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఇక్కడా తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో ఏసీబీ అధికారులు కార్యాలయం లోపలకు వెళ్లి తలుపులు మూసేసి సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఎవరినీ లోపలకు రానీయలేదు. దీనితో సమీపంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు వారి కార్యాలయాలు, షాపుల షట్టర్లను మూసేసి పరుగులు తీశారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన అనేక మంది బయట నిరీక్షించారు. అధికారుల నుంచి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం



చెక్‌ను అందజేస్తున్న దాత

సింహాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీన్న సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మహావిశాఖ నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురి పేరిట రూ.4 లక్షలను విరాళంగా సమర్పించారు. సీహెచ్ శంకరరావు, సీహెచ్ అమృత పల్లవి, సీహెచ్ తన్వి, టి.దామోదర్ పేరిట చెక్‌ను పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు బుధవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ ప్రవేశం కల్పించి, దర్శనం అనంతరం శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

మత్స్యకార మహిళలను గుర్తించాల్సిందే

ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కె.కనకారావు



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు కనకారావు

డాబాగార్డెన్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార మహిళలను ఆర్థిక వ్యవస్థలకు కేంద్ర బిందువుగా గుర్తించాల్సిన అవసరముందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కె.కనకారావు అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో 'అంతర్జాతీయ మహిళా మత్స్యకార దినోత్సవం' నిర్వహించారు. కనకారావు మాట్లాడుతూ కేరళలో జరిగిన ఇండియా ఫిషర్ వుమెన్ అసెంబ్లీ, అంతర్జాతీయ మహిళా మత్స్యకార దినోత్సవాన్ని ఏటా నవంబరు 5న నిర్వహించాలని నిరుడు తీర్మానించిందన్నారు. మత్స్యకారుల పోరాటానికి వరల్డ్ ఫోరం ఆఫ్ ఫిషర్ పీపుల్స్ మద్దతుగా నిలుస్తోందని తెలిపారు. పాలకుల విధానాలతో సముద్ర దోపిడీ, వాతావరణ సంక్షోభం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ఫిష్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.లక్ష్మి మాట్లాడుతూ మత్స్యకార మహిళల జీవితం, సంస్కృతి, వాణిజ్య పనులలో వారి ప్రాధాన్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. మత్స్యకార మహిళల శ్రమను గుర్తించి ప్రభుత్వ, సహకార, సామాజిక సంస్థలలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అన్ని మత్స్యకార చట్టాలు, విధానాలలో హక్కుదారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న అతిథులు

జ్ఞానాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి (వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ హాజరయ్యారు. 2024-25 సంవత్సరానికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 200 మంది విద్యార్థినులకు అతిథులు పట్టాలు, బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీకే జయలక్ష్మి, డాక్టర్ టి.భాస్కరసుధ, డా.వి.సోనీ, డా.సుజాత, సిస్టర్ హేమ, ఆనీ పాల్, మేరీ నాన్సీ తదితరులు పాల్గొన్నారు..

ఆ మార్గాల్లో రాకపోకలు సవాలే!



మెట్టు నుంచి జాషువానగర్ వెళ్లే రోడ్డు ఇలా...

కంచరపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి జాషువానగర్ మీదుగా జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలే ఎదురవుతున్నాయి. అసలే చిన్న రోడ్డు కావడం, అందులో సగం వరకు తోపుడు బండ్లు, చిరువర్తకులతో ఆక్రమణకు గురికావడంతో రాకపోకలకు అవస్థలు తప్పడంలేదు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు అసహనానికి గురవుతుంటారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర సమయాల్లో 108, అగ్నిమాపక వాహనాలు కూడా రాలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బాబోయ్ గోతులు!

సీతమ్మధార, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం రామాలయానికి వెళ్లే రహదారి మధ్యలో గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. కొద్ది రోజుల క్రితం మంచినీటి పైపులైన్ కోసం గోతులు తవ్వారు. అనంతరం పైపైన మట్టి వేసి వదిలేశారు. దీంతో వర్షాలకు గోతుల్లోని మట్టి కిందికి దిగిపోయింది. దీంతో రహదారి మధ్య పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో సంచరించే పిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులు కనిపిస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం శోచనీయమని స్థానికులు వాపోతున్నారు. బాటసారులకు ఇబ్బందికరంగా ఉండే ఈ గోతులను వెంటనే పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



నక్కవానిపాలెం రామాలయానికి వెళ్లే వీధిలో ప్రమాదకరంగా ఉన్న గోతులు


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

గుర్రమ్మపాలెం, మదపాకలో 'పొలం పిలుస్తోంది'

పెందుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్రమ్మపాలెం, ముదపాకలో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటకు మాని పండు తెగులు పట్టిందని, దీని నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. లీటరు నీటికి ప్రోపికోనజల్ మందును ఒక మిల్లీలీటర్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో ఏబీఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

అగనంపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన మండలస్థాయి చెకుముకి పోటీల్లో ఇ-మర్రిపాలెం ఏబీఎస్ పాఠశాల విద్యార్థులు కె. సిద్ధార్థ, జి. హిమవర్షిణి, శివ గురజార్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ పద్మజా దీపక్, డైరెక్టర్ దీపక్ అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.

యదు మేళా ర్యాలీ

పెందుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో బుధవారం నిర్వహించిన రాధాకృష్ణ ఉత్సవ యదు మేళాకు పీసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం ఆధ్వర్యంలో పెందుర్తి, పరిసర ప్రాంతాల నుంచి యాదవులు తరలివెళ్లారు. ర్యాలీని ప్రారంభించిన చైర్మన్ అయితి సింహాచలం మాట్లాడుతూ కడలిలో పాలు, పెరుగు ఉత్సవం నిర్వహణ యాదవ సంప్రదాయమన్నారు. దీని వల్ల యాదవుల ఐక్యత వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉప్పిలి దేవి కనకరాజు, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా



అక్కిరెడ్డిపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విశాఖ డెయిరీ సమీపంలో సర్వీస్ రోడ్డులో బుధవారం సాయంత్రం వ్యాన్ బోల్తా పడింది. బీహెచ్‌పీవీ నుంచి షీలానగర్ వైపు వెళుతున్న ఖాళీ వ్యాన్ అదుపు తప్పడంతో బోల్తాపడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వ్యాన్ పడ్డ చోట ఇంజన్ ఆయిల్ కారిపోవడంతో ద్విచక్ర వాహనాలను ప్రధాన రహదారిపై నుంచి వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

సినిమా గైడ్

- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), ,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 62, బెండకాయలు 52, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 50, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు(కిలో) 92, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు54, దోస కాయలు 32, వెల్లుల్ల (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 26, కాప్సికమ్62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడుచిక్కుడు 70, గోరుచిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు60, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230


పెదగంట్యాడలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు


కూర్మన్నపాలెం : శివాలయం వద్ద జ్వాలా తోరణం ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక ఆకర్షణగా వడ్లపూడిలో జ్వాలా తోరణం ఉత్సవం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకుల ఏర్పాట్లు

అగనంపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం అగనంపూడి పరిసర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా వేకువజామునుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా పెదమడక ఉమామహేశ్వర ఆలయం, పాతఅగనంపూడి లింగాల తిరుగుడి, కర్రి వానిపాలెం శివాలయం, జాబిలి హిల్స్ లోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

త్రిశక్తి ఆలయంలో..

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డుల లక్ష్మీపురంలో త్రిశక్తి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని 108 కలశాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు.

పలు వార్డుల్లో..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని 86, 87, 88 వార్డుల్లో శైవ, వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా వడ్లపూడిలో సీతారామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన జ్వాలా తోరణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కణితి పంచముఖి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాతృశ్రీనగర్‌లో విశ్వేశ్వర దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. 88వ వార్డు గ్రీన్‌సిటీలోని వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలంకరణ చేశారు. తొలుత శ్రీవారికి బంగారు వెండి ఆభరణాలతో విశేష అలంకరణ చేశారు. 87వ వార్డు కణితి పద్మశాలీ వీధిలో ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అఖండ దీపారాధన, సామూహిక పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శ్రీనగర్ కృష్ణాలయంలో

శ్రీనగర్ కృష్ణాలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణాలు, అమ్మవారి గీతాలు ఆలపించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో బుధవారం సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతాలు జరిగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దంపతులు విచ్చేసి ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

వేపగుంట పరిసర ప్రాంతాల్లో..

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా నాయుడుతోట, వేపగుంట పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు, వెంకటేశ్వరుని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మల్లేశ్వరాలయంలో స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపురేశ్వరి పీఠంలో పౌర్ణమి, ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలోనూ పూజలు చేశారు. 52, 90వ వార్డుల్లో ఉన్న శివాలయాల్లో పూజలు చేశారు.


బాలాత్రిపురేశ్వరి పీఠంలో పూజలు చేస్తున్న దృశ్యం

బాలాజీ దివ్యక్షేత్రంలో...

అక్కిరెడ్డిపాలెం, : కార్తీక పౌర్ణమి సందర్భంగా 68, 69 వార్డుల్లో ఉన్న పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. షీలానగర్‌లోని బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

సరిపల్లి స్వయంభు శివాలయంలో..

పెందుర్తి : మండలంలోని సరిపల్లి స్వయంభు శివాలయంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లక్ష ఒత్తులతో జ్వాలా తోరణం చేశారు. భక్తులు కోనేరులో దీపాలు వదిలారు. పినగాడిలో, సుజాతనగర్ శివాలయాల్లోనూ పూజలు జరిగాయి.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీపేట (కంచరపాలెం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో సతమతమవుతున్న బాధితులకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. 57వ వార్డు సుభాష్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.147 లక్షల విలువగల చెక్కులను గణబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్


బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సైన్స్, సాంకేతిక రంగాల వల్ల మానావళికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్. ప్రేమకుమార్ అన్నారు. బుధవారం తోటగరువు ఉన్నత పాఠశాలలో డీఈవో ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. జిల్లాలోని 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ స్కూల్ ఎడ్యుకేషన్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఈ డ్రామాలో ఉమెన్ ఇన్ సైన్సు ఫార్మ్, అగ్రికల్చర్, డిజిటల్ ఇండియా, హైజిన్ ఫర్ ఆల్, గ్రీనర్ టెక్నాలజీ అనే 5 ఉప అంశాలపై ఈ పోటీలునిర్వహించినట్టు చెప్పారు. ఈ పోటీల్లో పెందుర్తిలో గల జిల్లా పరిషత్తు శాంతినగర్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ అగ్రికల్చర్ ప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు డీఈవో తెలిపారు. గైడ్‌గా టీచర్ ఎంవై సీతావరలక్ష్మి వ్యవహరించారు. రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక అనుసంధానం చేసి అధిక దిగుబడులను ఏ విధంగా సాధించవచ్చో ఈ నాటికలో వివరించారు. అనంతరం తోటగరువు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు టి.రామకృష్ణ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి పి.రాజారావు, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు, రచయిత పీవీ రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరం జిల్లా విద్యాశాకాదికారిని, విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందించారు.

స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోను కాపాడాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌సిటీ డిపోను కాపాడాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైశ్రీనివాసరావు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని కోరారు. గవర్నర్ బంగ్లాలో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. డిపో అక్కడే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పీవీవీ మోహన్, శంకరరావు, శివాజీ, నాయుడు, చిన్నారావు తదితరులున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

గాజువాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి వరకూ తనిఖీలు కొనసాగాయి. కార్యాలయం లోపల ఉన్నవారిని బయటకు పంపించకుండా రిజిస్ట్రేషన్లు, ఇతర ఫైళ్లను పరిశీలించారు. ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్ల కోసం సింధియా పరిసర ప్రాంతాల నుంచి కార్యాలయానికి 200 మందికి పైగా వచ్చారు. ఉదయం 9 గంటలకే వారంతా కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంట సమయానికి కొంతమందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. అదే సమయానికి ఏసీబీ అధికారులు కార్యాలయానికి రావడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. కార్యాలయం తలుపులు మూసివేసి లోపల ఉన్నవారిని బయటకు పంపించకుండా తనిఖీలు చేశారు.


ఏసీబీ తనిఖీల సందర్భంగా వేచిఉన్న ప్రజలు



రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో ఆరుబయట పడిగాపులు కాస్తున్న మహిళలు

రహదారిపైనే డెబ్రిస్ డంపింగ్

పెదగంట్యాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మహాత్మాగాంధీ జంక్షన్ నుంచి గంగవరం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా డెబ్రిస్ గుట్టలుగా పేరుకుపోతోంది. దీంతో విశాలవంతంగా ఉండాల్సిన రోడ్డు డెబ్రిస్ ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో సన్నబడింది. ఈ రహదారిలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరింత ఇరుకు అవ్వడంతో ఎదురుగా వస్తున్న భారీ వాహనాలను తప్పించుకునే సమయంలో కష్టంగా ఉంటోందని పలువురు వాహనదారులు పేర్కొన్నారు. సుమారు ఆరు కిలోమీటర్లు పొడవున్న ఈ రోడ్డు పెదగంట్యాడ గాంధీ సెంటర్ నుంచి రెండు కిలోమీటర్లు వరకు ఇదే పరిస్థితి. పెదగంట్యాడ ప్రాంతంలో పాత ఇళ్లను తొలగించి నూతన ఇళ్లను నిర్మించుకునే వారు అనేక మంది తమ పాత ఇంటి శిథిలాలను, ఇతర వ్యర్థాలను తీసుకు వచ్చి రోడ్డు పక్కనే పోసేస్తున్నారు. పగటి వేళల్లో ఇలా డెబ్రిస్ వ్యర్థాలను రోడ్డు పక్కన వేస్తే ఎవరన్నా అభ్యంతరం చెబుతారన్న ఆలోచనతో రాత్రి వేళల్లో ఎక్కువగా ఇటువంటి పనుల చేస్తున్నారు. పెదగంట్యాడ నుంచి గంగవరం, పల్లిపాలెం, జాలరి పల్లిపాలెం, చిపాలెం గ్రామాలకు వాహనదారలు, పాదచారులు ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పక్కన ఉన్న పలు స్టాకుయార్డులకు మెటీరియల్ చేర్చేందుకు, అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు మెటీరియల్ తరలించేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి డెబ్రిస్, ఇతర శిథిలాలతో నిండిపోతోంది. ఈ రోడ్డులో డెబ్రిస్, ఇతర వ్యర్థాలను తొలగింపు చర్యలను జీవీఎంసీ అధికారలు చేపట్టాలని గంగవరం, పల్లిపాలెం, జాలరి పల్లిపాలెం, చినపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన డెబ్రిస్

జాగ్రత్త సుమా..!

గోపాలపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే కొత్తపాలెం అండర్‌పాస్‌వే వద్ద కాలువపై ఏర్పాటు చేసిన గ్రిల్ ప్రమాదకంరగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్‌వేలో తరచూ భూగర్భం నుంచి తరచూ నీటిఊటలు వస్తుంటాయి. దీంతో ఏడాదిలో ఆరు నెలలు అండర్‌పాస్‌వే చిత్తడిగానే ఉంటోంది. అయితే ఈ నీటి ఊటలు సమీపంలో గెడ్డలోకి చేరడానికి అండర్‌పాస్‌వే ముందర కాలువ నిర్మించి గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడా గ్రిల్ శిథిలస్థితికి చేరుకుంది. దీంతో చాల రోజులగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రిల్‌లోని ఊచలు పైకి లేవడంతో మరింత ప్రమాదభరితంగా మారింది. వాహనదారులు ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా ప్రాణాలకు ప్రమాదం ఉంది. వెంటనే ఈ గ్రిల్‌ను తొలగించి దాని స్థానంలో కొత్తగ్రిల్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలమైన డ్రైనేజీ గ్రిల్


కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు
చిత్రంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఇతర నాయకులు

భూములను పరిశీలించాలని కలెక్టర్‌కు వినతి

గోపాలపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైల్వే లైన్ నిర్మాణం కోసం వినియోగిస్తున్న రైతుల జిరాయితీ భూములను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కొత్తపాలెం రైతులు కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. 89వ వార్డు శివారులోని విశాఖ-విజయవాడ మెయిన్ లైన్‌కు సమానంగా అదనంగా కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం రైల్వే శాఖ పనులు ప్రారంభించింది. అయితే ఈ ప్రాంతంలో కొత్తపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన జిరాయితీ భూమలు కూడా ఉన్నాయి. అయితే ఇవి బంజర భూములుగా రికార్డుల్లో ఉన్నట్టు రైల్వే అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెంది, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును కలిసి సమస్యను వివరించారు. ఈమేరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాధిత రైతులు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ట్రాక్ నిర్మాణంలో జిరాయితీ భూములు పోతున్నాయని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుని శాఖల వారీగా విభజించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ రాష్ట్ర నాయకుడు సేనాపతి సోమశేఖర్ పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి : సీఐ

పెదగంట్యాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడలపై అందరూ ఆసక్తి చూపాలని న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు అన్నారు. క్రీడల వల్ల వ్యక్తిత్వ వికాశం పెరుగుతుందన్నారు. అక్టోబరు 24 నుంచి ఎనిమిది రోజుల పాటు గుజరాత్‌లోని సూరత్‌లో కుడో ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ కుడో పోటీల్లో సత్తా చాటిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులను రాష్ట్ర కుడో అసోసియేషన్ బుధవారం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలను ఇస్తాయన్నారు. రాష్ట్ర కుడో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ సూరత్‌లో జరిగిన కుడో నేషనల్, ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో 32 రాష్ట్రాల నుంచి సుమారు 3,700 మంది క్రీడా కారులు పాల్గొన్నారని, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు 41 పతకాలు సాధించారని అన్నారు. కార్యక్రమానికి స్థానిక నాయకుడు పేర్ల అప్పారావు అధ్యక్షత వహించారు. కుడో కోచ్ రమణ, టీమ్ మేనేజర్ బలరామకోటిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కుడో అసోసియేషన్ అధ్యక్షుడు ఆలూరి శశిధర్, ఉపాధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డాక్‌యార్డు వంతెన ప్రారంభం

మల్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను ఈనెల 11 లేదా 12వ తేదీల్లో ప్రారంభించడానికి పోర్టు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈనెల 14న నగరంలో సమ్మిట్ జరగనున్న కారణంగా ఈ వంతెనను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ వంతెన పై లోడింగ్ పరీక్షల కోసం ఆంధ్రయూనివర్సిటీకీ పోర్టు అధికారులు లేఖ రాశారు. ఏయూ నుంచి నిపుణులు వచ్చి లోడింగ్ పరీక్షలు చేసిన అనంతరం వంతెనపై రాకపోకలకు అనుమతులిస్తామని అధికారులు పేర్కొన్నారు.

భద్రతా లోపాలపై చర్యలు తీసుకోవాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న భద్రతా లోపాలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివ శంకరరెడ్డికి ప్లాంట్ సీఐటీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్లాంట్‌లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాంట్‌లో తుప్పు పట్టిన యంత్రాలను తొలగించి కొత్తవి అమర్చాలని కోరారు. ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదిలీ చేసే సమయంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

'చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'

అగనంపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సౌత్ క్రైమ్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాగే డిజిటల్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సామాజిక బాధ్యతతో కలిగి ఉండి, నైతిక విలువలను పాటిస్తే దేశ భవిష్యత్తు మరింత సురక్షితంగా ఉంటుందన్నారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు సీఐను సత్కరించారు.


సీఐ శ్రీనివాసరావును సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

విద్యార్థులకు సన్మానం

వేపగుంట నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తమాలజీ కోర్సుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో రాణించడానికి మరింత పట్టుదల, సహనం, కృషి ఉండాలన్నారు.

'రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి'

పెదగంట్యాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్‌గా రూ. 9 వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. దీనబంధు డిమాండ్ చేశారు. బుధవారం పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 30 ఏళ్ల పాటు సేవలందించినవారు ఉద్యోగ విరమణ చేసిన అనంతరం రూ. వెయ్యి నుంచి రూ. మూడు వేలు మాత్రమే పెన్షన్ అందుకుంటున్నారన్నారు. ఆ పెన్షన్ సరిపోవడం లేదని తెలిపారు.

నేడు మాజీ మంత్రి ఎస్ఆర్ఏఎస్ జయంతి

పెందుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి దివంగత ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడు శత జయంతి గురువారం పెందుర్తిలో నిర్వహించనున్నామని పీసీసీ సభ్యుడు ఆడారి రమేశ్‌నాయుడు బుధవారం తెలిపారు. పెందుర్తిలో ఎస్ఆర్ఏఎస్ కాంస్య విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకే దత్తత ప్రోగ్రామ్


సదస్సులో మాట్లాడుతున్న హరికృష్ణ

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారికి ఉత్తమమైన కుటుంబ జీవితాన్ని అందించేందుకే దత్తత పథకాన్ని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.హరికృష్ణ పేర్కొన్నారు. జాతీయ దత్తత మాసంలో భాగంగా ప్రభుత్వ ప్రత్యేక బాలికల సదనం, పరిశీలన గృహలో దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు. కుటుంబ వాతావరణంలో పెరిగితే అవరోధాలు లేని భవిష్యత్తును పొందే వీలుంటుందన్నారు. హోమ్ సూపరింటెండెంట్ సి.నయోమి, ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి బాస్కెట్‌బాల్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పురుషుల మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ ఈనెల 7 న ప్రారంభం కానుంది. విశాలాక్షినగర్‌లోని బీవీకే హైస్కూల్ వేదికగా నాలుగు రోజులపాటు జరగనున్న టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొంటారు. 30 మంది టెక్నికల్ అఫిషియల్స్‌గా వ్యవహరించనున్నారు. వివరాలకు 9966753209 నంబరులో సంప్రదించాలని అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి తెలిపారు.

డీసీసీబీలో అక్రమాలపై విచారణ జరపండి

» ఆప్కాబ్ ఎండీకి కార్పొరేటర్ మూర్తియాదవ్ ఫిర్యాదు

విశాఖపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జరుగుతున్న అక్రమాలు, ఉద్యోగుల పదోన్నతుల్లో సొమ్ము వసూళ్లపై సీఐడీ, విజిలెన్స్ విభాగాలతో విచారణ చేయించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయానికి వెళ్లి ఎండీ, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. డీసీసీబీ నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న కోన తాతారావు బాధ్యతలు స్వీకరించిన తరువాత అక్రమాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉద్యోగుల పదోన్నతుల్లో పర్సన్ ఇన్‌చార్జి బృందం రూ.కోటి వసూలు చేశారని, దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. పర్సన్ ఇన్‌చార్జి కుమారుడి బావమరిది వసూళ్లకు పాల్పడ్డారన్నారు. ఇదే పదవిలో జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ ఉండగా కేవలం రూ.3 వేలు మాత్రమే ఖర్చు జరిగిందన్నారు. కానీ ఆ తరువాత ఐదునెలల్లో రూ. 30 లక్షలు దుర్వినియోగంచేశారన్నారు. మొత్తం వ్యవహారాలపై విచారణ చేయాలని కోరారు.

భగల్‌పూర్-బెంగళూరు మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా భగల్‌పూర్ నుంచి బెంగళూరుకు (ఒకవైపు మాత్రమే) అన్ రిజర్వుడ్ ప్రత్యేక రైలు నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 03403 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 7న రాత్రి 10.30 గంటలకు భగల్‌పూర్‌లో బయలుదేరి 9న తెల్లవారుజామున 2.20 గంటలకు దువ్వాడ, రాత్రి 10.30 గంటలకు బెంగళూరు చేరుతుంది.

ఇసుక కొండకు పోటెత్తిన జనం


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

» సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న భక్తులు
» సంప్రదాయబద్ధంగా కార్తీక పౌర్ణమి పూజలు
» రికార్డు స్థాయిలో వెయ్యికి పైగా వ్రతాలు


స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

మహారాణిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కేజీహెచ్ సమీపంలోని రమా సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి ప్రారంభమయింది. స్వామి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో నిరీక్షించారు. ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించి, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా రికార్డు స్థాయిలో సుమారు వెయ్యి మందికి పైగా దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో కార్యనిర్వాహక అధికారి టి.రాజగో పాలరెడ్డి తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు అందేలా పర్యవేక్షించారు. దక్షిణ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, గణబాబు, డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

సింహాచలంలో సంప్రదాయబద్ధంగా జల హారతి

భక్తులతో కిటకిటలాడిన వరాహ పుష్కరిణి



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు, వరాహ పుష్కరిణిలో పవిత్ర దీపాలను వదులుతున్న భక్తులు

సింహాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల ఆనందోత్సాహాల నడుమ సింహాచలం కొండదిగువ వరాహ పుష్కరిణిలో పుణ్యజల హారతిని బుధవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం ఉపాలయం పద్మావతి, అలివేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా వరాహ పుష్కరిణికి తీసుకువచ్చారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఏక, ద్వయ, సప్త, కుంభ, నక్షత్ర తదితర దశ హారతులను పుష్కరిణిలోని గంగకు సమర్పించారు. అనంతరం భక్తులకు ఆవుపేడతో చేసిన ప్రమిదలు, ఒత్తులు, నూనె దేవస్థానం ఏర్పాటు చేయగా దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హారతి కార్యక్రమంలో ఈవో ఎన్.సుజాత, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, ఈఈ సీహెచ్ వెంకటరమణ, ఎస్‌డీసీ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు మెరుగైన సేవలు

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాలవీరాజనేయస్వామి
» కేజీహెచ్‌లో 10 డయాలసిస్ యూనిట్లు ప్రారంభం



కేజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డోలా, తదితరులు

మహారాణిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ బాధితులకు కేజీహెచ్‌లో మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఎన్టీపీసీ సామాజిక బాధ్యలో భాగంగా సుమారు రూ2 కోట్లతో కొనుగోలుచేసి అందించిన డయాలసిస్ యూనిట్లను బుధవారం మంత్రి నెఫ్రాలజీ విభాగంలో ప్రారంభించారు. అనంతరం రోగులను పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేలా రూ.25 లక్షల వ్యయంతో సార్వత్రిక బీమా కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, ప్రజలకు డిజిటలైజ్డ వైద్య సేవలను చేరువ చేస్తామన్నారు. నెఫ్రాలజీ విభాగంగా ఇప్పటికే 13 డయాలసిస్ యూనిట్లతో రోగులకు సేవలందుతున్నాయని, ఎన్టీపీసీ సమకూర్చిన మరో పది యూనిట్లతో మరింతమందికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు,విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవిలత, ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్‌ను వినియోగించుకోండి

విశాఖపట్నం: ప్రభుత్వం అందించే ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విద్యార్థులకు సూచించారు. రుషికొండ వద్ద గల బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. లైబ్రరీ, కంప్యూటర్ రూమ్, సెమినార్ హాల్ తనిఖీ చేశారు. హాస్టల్‌ను పరిశీలించి వసతులు మరింత మెరుగుపర్చాలని సూచించారు. స్టడీ సర్కిల్ చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రపరిచి, మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ గ్రేస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి సమీక్ష

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టులపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో జరగనున్న సీఐఐ సదస్సు ఏర్పాట్లను ఆయన పరిశీలిస్తారు. అక్కడి నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకుని మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి జీవీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధిపనులు, ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

డీసీపీ-1గా బాధ్యతలు స్వీకరించిన మణికంఠ చందోలు


మణికంఠ చందోలు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-1గా మణికంఠచందోలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీపీ శంఖబ్రతబాగ్చిని కలిశారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మణికంఠచందోలు గతంలో డీసీపీ-1 పనిచేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థంగా పనిచేస్తానన్నారు. ఈ నెల 14 నుంచి నగరంలో జరిగే అంతర్జాతీయస్థాయి సదస్సులకు బందోబస్తు, ప్రతినిధుల భద్రతకు కృషిచేస్తానన్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో రూ.250 కోట్లతో 69 సబ్ స్టేషన్లు

» నాణ్యమైన విద్యుత్ పంపిణీయే ప్రభుత్వ లక్ష్యం
» విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్


అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం చౌడువాడలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్. చిత్రంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ విజయకృష్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, తదితరులు ఉన్నారు

అనకాపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌడువాడ గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీపీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్‌కు) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, కలెక్టర్ విజయకృష్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే అధికారులపై చర్యలు

» హెచ్చరించిన మేయర్ పీలా శ్రీనివాసరావు


ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైన మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న పెట్టుబడిదారుల సదస్సు కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని మేయర్ పీలా శ్రీనివాసరావు హెచ్చరించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులు, స్థితిగతులపై ఆరా తీశారు. సీఐఐ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి ప్రతినిధులు, దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్రమంత్రులు హాజరవుతారని, ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, కల్యాణమండపాలు, సామాజిక భవన నిర్మాణాల వివరాలను ఈఈలను అడిగితెలుసుకున్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పనులు ప్రారంభించకపోయినా, పూర్తిచేయకపోయినా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజు, ఎస్ఈ గోవిందరావు, ఈఈ రాత్నాకర్‌రెడ్డి, రాయల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

బాలుడి ఆత్మహత్య


మోజేష్ (ఫైల్ ఫొటో)

మధురవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చంద్రంపాలెంలో బుధవారం జరిగింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రంపాలెం భరత్‌నగర్‌కు చెందిన గేదెల వెంకటరావు కుమారుడు గేదెల మోజేష్ (16) పదోతరగతి ఫెయిలై స్నేహితులతో జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో అతడి తల్లి మంగళవారం రాత్రి మందలించింది. చెడుస్నేహాలు విడిచిపెట్టి చదువుపై దృష్టిపెట్టాలని హితబోధ చేసింది. దీనిని జీర్ణించుకోలేని బాలుడు బుధవారం చంద్రంపాలెం శ్మశానవాటిక సమీపంలో ఉన్న షెడ్‌లో చీరతో ఉరివేసుకున్నాడు. అటువైపు వెళ్లిన వారు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదుచేశారు. కుమారుడి మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని అతడి తండ్రి తెలిపినట్టు పోలీసులు వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

» ముగ్గురు యువకులకు గాయాలు


సూర్యనారాయణ (ఫైల్ ఫొటో)

ఆరిలోవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతిచెందగా మరో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన పైనాపిల్ కాలనీ బీఆర్టీఎస్ రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగింది. ఆరిలోవ ఎస్ఐ రామదాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడివివరం నుంచి ముగ్గురు యువకులు బైక్‌పై అమితవేగంతో వస్తూ రోడ్డు దాటుతున్న సీతంపేటకు చెందిన సూర్యనారాయణ (60)ను ఢీకొట్టారు. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు జగదాంబ జంక్షన్‌లో చిన్న దుకాణం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న అతడి భార్య ఈశ్వరమ్మ ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా విలపించింది. భర్త వికలాంగుడని, కర్ర సాయంతో నడుస్తుంటాడని రోదించింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు శివరామ్ బీటెక్ చదువుతున్నాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామదాసు తెలిపారు.

స్పా ముసుగులో వ్యభిచారం

» పోలీసుల అదుపులో ఇద్దరు విటులు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న వీఐపీ రోడ్డులోని ఒక మసాజ్ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు బుధవారం దాడి చేశారు. ఇద్దరు విటులు, పది మంది యువతులను పట్టుకున్నారు. వీఐపీరోడ్డులోని ఆర్చిడ్ వెల్‌నెస్ అండ్ స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందనే సమాచారంతో పోలీసులు దాడి చేయగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తేలింది. భారీగా కండోమ్‌ప్యాకెట్లు, బాత్‌రూమ్‌లో వాడేసిన కండోమ్‌లు కనిపించాయి. ఇద్దరు యువకులు పారిపోయేందుకు యత్నించగా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో నేరాన్ని అంగీకరించారు. వారితోపాటు నిర్వాహకులపై కేసు నమోదుచేసి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు, పట్టుబడిన యువతులను పునరావాస కేంద్రానికి తరలించారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

తగరపువలస, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామన్నపేట, రాజావీధిలో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసులో పోలీసులు ఒక మహిళను అరెస్టు చేశారు. ఎస్ఐ సూర్యప్రకాశరావు తెలిపిన వివరాలు ప్రకానం.. గత నెల 4న రాజావీధికి చెందిన కాకి కాంత ఇంట్లోని బీరువాలో ఉంచిన పుస్తెల తాడు, ఉంగరం, చెవి దుద్దులు, రింగులు, డాలర్ ఆకులు వంటి అయిదున్నర తులాల ఆభరణాలు, అలాగే అదే నెల 12న రామన్నపేటకు చెందిన నాలి వరలక్ష్మి ఇంట్లో రెండు పేటల బంగారు గొలుసు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వేర్వేరుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు చోరీల్లోనూ ఒక మహిళ ప్రమేయం ఉన్నట్టు గుర్తించి బుధవారం అదుపులోకి తీసుకున్నారు. బాధితులిద్దరు సదరు మహిళ వద్ద చీటీలు వేసేవారు. చీటీల డబ్బులు కోసం నిందితురాలు తరచూ వాళ్ల ఇంటికి వెళ్లేది. ఈ క్రమంలో రెండు చోట్లా చోరీకి పాల్పడింది. పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు పేరు రికార్డుల్లో ఉన్నప్పటికీ మీడియాకు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

రేషన్ డిపోల్లో సరుకుల తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చక్కెర ప్యాకెట్లు పరిశీలిస్తున్న అధికారులు

గాజువాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలు ప్రభుత్వ రేషన్ డిపోల్లో తడిసిన బియ్యం, తేమతో నిండిన పంచదార కార్డుదారులకు అందిస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు పలు డిపోలను బుధవారం తనిఖీ చేసి, చక్కెర ప్యాకెట్లలో తేమ ఉన్నట్టు గుర్తించారు. డీఎస్వో వి.భాస్కర్ ఆదేశాల మేరకు సిబ్బంది 7212 రేషన్ డిపోలో 40, 336 రేషన్‌డిపోలో 40, 8588 రేషన్‌డిపోలో 248 చక్కెర ప్యాకెట్లు తడిసి పోయి ముద్దగా ఉన్నట్టు గుర్తించారు. నివేదిక పరిశీలించిన డీఎస్ఓ భవిష్యత్తులో ఇటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. కార్డుదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏఎస్ఓలను ఆదేశించారు.

శతాబ్ది క్రీడా టోర్నమెంట్ మెడల్స్ ఆవిష్కరణ


క్రీడాకారులకు అందించే మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులకు అందించే మెడల్స్‌ను బుధవారం ఆవిష్కరించారు. పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మెడల్స్‌ను అధికారులతో కలిసి ఉప కులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ఆవిష్కరించారు. మెడల్స్‌లో ఒకవైపు ఆంధ్ర విశ్వవిద్యాలయం లోగో, మరో వైపు శతాబ్ది సంవత్సర లోగోలను పొందుపరిచారు. టోర్నమెంట్‌లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి జ్ఞాపకంగా మెడల్స్‌ను అందించనున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్, రిజిస్ట్రార్ కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ ఎ.నరసింహారావు. జి.శశిభూషణరావు, జి.గిరిజా శంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, పద్మశ్రీ, క్రీడా విభాగం సంచాలకులు ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, డీన్లు ప్రొఫెసర్ ఎస్.హరినాథ్, జాలాది రవి, ఏయూ సిబ్ సంచాలకులు డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారాదీప్ పోర్టు డిప్యూటీ చైర్మన్‌గా వేణుగోపాల్

» విశాఖ పోర్టు సెక్రటరీకి పదోన్నతి


వేణుగోపాల్

విశాఖపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ సెక్రటరీ టి.వేణుగోపాల్‌ను పారాదీప్ పోర్టు డిప్యూటీ చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వేణుగోపాల్ 1995లో విశాఖపట్నం పోర్టులో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్‌గా చేరి, అనేక విభాగాల్లో పనిచేశారు. 2019లో సెక్రటరీగా పదోన్నతి పొంది దీనదయాళ్ (కాండ్లా) పోర్టుకు వెళ్లారు. తిరిగి 2020లో విశాఖ పోర్టుకు కార్యదర్శిగా వచ్చారు. ఆయన హయాంలో బిమ్‌స్టెక్, ఇండియన్ మేరీటైమ్ సదస్సులు జరిగాయి. ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభమైంది. వేణుగోపాల్‌కు పదోన్నతి లభించడం పట్ల పోర్టు అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు.